


Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 30 | మంగళవారం 08 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## వృద్ధాశ్రమాలపై తాజా సమాచారం కావాలి

- నాలుగు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్‌లు ఇవ్వండి
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశవ్యాప్తంగా గల వృద్ధాశ్రమాల సంఖ్య, వాటి వివరాలు, అలాగే సీనియర్ సిటిజన్‌లకు అందుబాటులో వున్న సదుపాయాల గురించి తాజా స్టేటస్ రిపోర్ట్‌లను దాఖలు చేయాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు సోమవారం - మిగతా 2లో..

# ఢిల్లీలో పెను విషాదం..

- కుప్పకూలిన ఐదంతస్తుల భవనం!
- శిథిలాల కింద చిక్కుకుని ఆరుగురు దుర్మరణం
- తీవ్రంగా కలచివేసిందన్న ప్రధాని మోదీ
- పీజీ భవనం నేలమట్టం
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని మోడీ
- బేస్‌మెంట్ పనులే కారణమా?




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశ రాజధాని ఢిల్లీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సత్యనికేతన్ ప్రాంతంలో సుమారు 40-50 ఏళ్ల నాటి ఐదంతస్తుల పాత భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో పెను విషాదం అలుముకుంది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనంలో పేయింగ్ గెస్ట్ పీజీ వసతి నడుస్తుండటంతో, ప్రమాద సమయంలో అక్కడ పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు 11 మందిని సురక్షితంగా బయటకు తీయగా, శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండే అవకాశం ఉందని - మిగతా 2లో..



## బీజేపీకి సిగ్గుచేటు

- బీజేపీపై రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

ఢిల్లీలో సత్యనికేతన్ భవనం కూలిపోయిన ఘటనపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బీజేపీ పై విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో 'ట్రిపుల్-ఇంజిన్' ప్రభుత్వం ఉండగా ఈ నిస్సహాయతకు సాకు ఏమిటని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. ప్రశ్నలు అడిగే వారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'దిమాగీ నక్సల్', 'నారాజ్ ఫుఫా' వంటి అవమానకరమైన ముద్రలు వేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిసారీ - మిగతా 2లో..

# కార్యకర్తలే పార్టీకి బలం..

- వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి: లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు
- కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
 టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి

అమరావతి - సూర్య వాస్తవం

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గ నిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.



**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంటపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. - మిగతా 2లో..

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- సీఎం రేవంత్ రెడ్డి
- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



హైదరాబాద్ - సూర్య వాస్తవం

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక - మిగతా 2లో..

# దూషిస్తే తాటతీస్తాం

- మహిళా ప్రముఖులపై వ్యక్తిగత దాడులను సహించబోం
- రాజీలేని.. చట్టపరమైన కఠినచర్యలు తప్పవ్
- ప్రతిపక్షాలకు తమిళనాడు సీఎం విజయ్ హెచ్చరిక
- అసెంబ్లీలో మాజీ సీఎం జయలలిత, నటి త్రిష ప్రస్తావన
- టాస్మాక్ 'కుంభకోణం'ను ప్రస్తావిస్తూ.. డీఎంకేపై తీవ్ర విమర్శలు
- గత ప్రభుత్వం 'కరూర్ గ్యాంగ్' పాలన చేసింది: సీఎం విజయ్

చెన్నై- సూర్య వాస్తవం

మహిళలను దూషిస్తే తాటతీస్తామని ప్రతిపక్ష డీఎంకేను ఉద్దేశించి తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దాడులు, ద్వంద్వార్థ దూషణలు, లేదా అవమానకరమైన భాషను వాడడం.. వంటి వాటిపై తక్షణమే, రాజీలేని చట్టపరమైన పరిణామాలు ఉంటాయని గంభీరమైన స్వరంతో ఫైర్ అయ్యారు. మహిళా ప్రముఖులపై వ్యక్తిగత దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ.. మాజీ సీఎం జయలలిత, నటి త్రిష పేర్లను ప్రస్తావించారు. ప్రజామర్యాద, రాజకీయ నైతిక విలువలపై 'నా వైఖరి స్పష్టం'మని తెలిపారు. టాస్మాక్ 'కుంభకోణం'ను ప్రస్తావిస్తూ.. - మిగతా 2లో..



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఆదివాసీల హక్కుల జోలికొస్తే ఖబడ్దార్

- 'భూమి, అడవులు మావే.. అదానీ, అంబానీలవి కావు'
- ఢిల్లీలో వేలాదిమందితో షాహిద్ పార్కులో ధర్నా, ప్రదర్శన
- షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రాజ్యాంగ హక్కులు అమలు చేయాలని డిమాండ్

2లో

# ఢిల్లీలో పెను విషాదం..

(మొదటిపేజీ తరువాయి)
అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, భవనం కింద భాగంలో బేస్‌మెంట్ జరుగుతున్న మరమ్మతు పనులే ఈ ప్రమాదానికి కారణమా అనే కోణంలో పోలీసులు మరియు మున్సిపల్ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు.

# వృద్ధాశ్రమాలపై తాజా సమాచారం కావాలి

(మొదటిపేజీ తరువాయి)
ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తాజా సమాచారాన్ని అందచేయాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అడ్వకేట్స్ జనరల్‌కు, స్టాండింగ్ కౌన్సిళ్ళకు ఈ ఆదేశాల గురించి తెలియచేయాలని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని కోరింది. కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ న్యాయవాది అశ్విని కుమార్ వృద్ధుల సంక్షేమం గురించి ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువున జీవిస్తూ, సరైన వసతి, ఆహారం, వైద్య సంరక్షణ లేని వారి గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ 2016లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల పిటిషన్‌ను బెంచ్ విచారించింది. వృద్ధులు గౌరవంగా జీవించడానికి వీలుగా తగినన్ని వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని ఆ పిటిషన్ కోరుతోంది. దేశంలో వృద్ధాశ్రమాలు ఎన్ని వున్నాయి, వారికి వచ్చే పెన్షన్, వారికి అందుబాటులో వున్న వైద్య సంరక్షణ వంటి అంశాలకు సంబంధించి పూర్తి వివరాలను అందచేయాల్సిందిగా గతంలో కేంద్ర ప్రభుత్వం కోరిందని, కానీ ఇంకా రాలేదని విచారణ సందర్భంగా కుమార్ పేర్కొన్నారు. త్వరితగతిన విచారణ జరపాలని పలుసార్లు అభ్యర్థించినప్పటికీ 2022 నుండి ఈ అంశం విచారణకు రాలేదని ఆయన పేర్కొన్నారు. దీనిపై కేంద్రం తరపు న్యాయవాది మాట్లాడుతూ, పర్యవేక్షణ నిమిత్తం ఈ ప్రొసీడింగ్స్‌ను ఆయా రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ చేయాలని సూచించారు. ఆ సూచనను కుమార్ వ్యతిరేకించారు. సుప్రీం కోర్టే ఈ ప్రొసీడింగ్స్‌ను పర్యవేక్షణను కొనసాగించాలని వాదించారు. దేశవ్యాప్తంగా అమలయ్యేలా తీసుకోవాల్సిన నిర్ణయం ఇదని, హైకోర్టులకు వదిలిపెట్టరాదని అన్నారు. సుప్రీం కోర్టు విస్తృత మార్గదర్శకాలను రూపొందించినా వాటి అమలును అంతిమంగా హైకోర్టులే పర్యవేక్షించాల్సి వుంటుందని చీఫ్‌జస్టిస్ పేర్కొన్నారు. ఈ ప్రొసీడింగ్స్‌ను ఎవరు పర్యవేక్షించాలనేది నిర్ణయించడానికి ముందుగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి ఆధునీకరించిన సమాచారం అందాలని బెంచ్ పేర్కొంది.

# కార్యకర్తలే పార్టీకి బలం..

(మొదటిపేజీ తరువాయి)
"విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)
ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

# బీజేపీకి సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)
బీజేపీ ప్రభుత్వం అదే సిగ్గుచేటైన విధానాన్ని అనుసరిస్తుందని, ప్రమాదాలు జరగకముందే నివారణ చర్యలు చేపట్టకపోవడం, అవి జరిగిన తర్వాత కేవలం ఆర్భాటపు ప్రకటనలు చేయడం, అలాగే అసలైన బాధ్యులను వదిలేసి కింది స్థాయి అధికారులపై నిందలు మోపడం వంటివి బీజేపీ ప్రభుత్వాలకు సర్వసాధారణం అని ఎక్స్ వేదికగా ఆయన రాసుకొచ్చారు

# బాండ్ ఉల్లంఘన.. పీడీఎస్ బియ్యం కేసులు

## - వీరబ్రహ్మయ్యకు 14 రోజుల జైలు

**చెన్నూరు- సూర్య వాస్తవం:** ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండేందుకు రూ.లక్ష స్వీయ పూచీకత్తుతో బైండ్‌ఓవర్ చేసిన వ్యక్తి నిబంధనలు ఉల్లంఘించడంతో 14 రోజుల పాటు జైలుకు తరలించారు. చెన్నూరు పట్టణానికి చెందిన కాటం వీరబ్రహ్మయ్య (64) గతంలో బైండ్‌ఓవర్ అయ్యారు. బాండ్ అమల్లో ఉండగానే ప్రభుత్వ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసినట్లు ఆయనపై చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. బాండ్ నిబంధనలు ఉల్లంఘించినందుకు వివరణ ఇవ్వాలని తహశీల్దార్ నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. రూ.లక్ష బాండ్ మొత్తాన్ని జమ చేయాలన్న ఆదేశాలను సైతం పాటించలేదు. వీరబ్రహ్మయ్య పూర్వ నేరచరిత్ర, తిరిగి నేరాలకు పాల్పడే అవకాశం, ప్రజాశాంతికి ముప్పు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని చెన్నూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ షేక్ చాంద్‌బాషా ఇచ్చిన నివేదిక మేరకు తహశీల్దార్ చట్టప్రకారం 14 రోజుల పాటు అదుపులో ఉంచాలని ఆదేశించారు. దీంతో గురువారం చెన్నూరు పోలీసులు వీరబ్రహ్మయ్యను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# దూషిస్తే తాటతీస్తాం

(మొదటిపేజీ తరువాయి)
డీఎంకేపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం 'కరూర్ గ్యాంగ్' పాలన చేసిందని, ఈడీ నివేదికలో ఉన్నదే మాట్లాడుతున్నాని సీఎం విజయ్ తెలిపారు. తమిళనాడు అసెంబ్లీలో సోమవారం సీఎం విజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెనుదుమారాన్ని రేపుతున్నాయి. ప్రస్తుతం త్రిష వివాదానికి మరింత ఆజ్యం పోశాయి. తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి జయలలిత ఎదుర్కొన్న అవమానాల ను ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. మహిళా ప్రముఖులకు సంబంధించిన వివాదాల నేపథ్యంలో జరుగుతున్న వ్యక్తిగత దాడులను ఆయన ఖండించారు. ప్రజామర్యాద, రాజకీయ నైతిక విలువలపై తన వైఖరి స్పష్టం చేశారు. గంభీరమైన స్వరంతో ఇద్దరు ప్రముఖ మహిళా నాయకు లైన దివంగత ముఖ్యమంత్రి జయలలిత, నటి త్రిషను ప్రత్యక్షంగా, పరోక్షం గా ప్రస్తావించారు.

ప్రజా జీవితంలోని మహిళలపై జరుగుతున్న వ్యక్తిగత, అసభ్యకరమైన దాడులను విజయ్ పరోక్షంగా తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీలో తన ఉద్వేగభరితమైన, దృఢమైన ప్రసంగంలో విజయ్, మహిళల గౌరవ మర్యాదలకు తన ప్రభుత్వ అజెండాలో అగ్రస్థానం కల్పించారు. ప్రజా స్వామ్యంలో కఠినమైన రాజకీయ విమర్శలను స్వాగతించినప్పటికీ, మహిళలపై వ్యక్తిగత దాడులను ఎన్నటికీ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. 'నా రాజకీయ విజయానికి ప్రధాన కారణం మహిళలే' అని సీఎం విజయ్ తెలిపారు. 'ఎముక లు విరగ్గొడతాం' వంటి శారీరక బెదిరింపుల తో కూడిన వ్యాఖ్యలను ఆయన ఖండించా రు. ప్రజాస్వామ్య తీర్పు పట్ల అగౌరవాన్ని ప్రదర్శించే ప్రకటనలను తప్పుబట్టారు. అంతర్గత భద్రతా పరిరక్షణ చట్టం (మిసా)తో సహా చారిత్రక రాజకీయ మైలురాళ్లను ప్రస్తావించారు. 'అబద్ధాలు మాట్లాడటం, డబ్బు తీసుకోవడం, సంచులు మోయడం... ఇలా డీఎంకే ప్రవర్తనను దిగ్గజ తమిళ కవి, గేయ రచయిత కన్నదాసన్ వర్ణించారు' అని విజయ్ అన్నారు.

**డీఎంకేపై టాస్మాక్ 'కుంభకోణం' అస్త్రం**

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మద్యం విక్రయ సంస్థ టాస్మాక్‌లో జరిగిన అవినీతిపై సీఎం విజయ్ గత డీఎంకే ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకు న్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ వెల్లడించిన వివరాలను ఆయన వెల్లడించారు. రాష్ట్ర అసెంబ్లీలో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పత్రాల ను చదువుతూ, 2021 నుంచి 2025 మధ్య కాలంలో 'కరూర్ గ్యాంగ్'గా పిలవబడే ఒక 'సంఘటిత నేర ముఠా' అక్రమ వసూళ్లు, టెండర్ల అవకతవకలు, చట్టవిరుద్ధ బదిలీల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎలా ఆయుధంగా వాడుకుందో ఆయన వివరించారు. కరూర్, కోయంబత్తూరు ప్రాంతాల లో ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ పనిచేస్తూ, 'మద్యం వినియోగదారుల నుంచి క్రమపద్ధతిలో అదనపు నగదును వసూలు చేసిందని, స్థానిక బార్ యజమానులను బెదిరించిందని' ఆయన ఆరోపించారు. 'దేవుడు, ప్రకృతి, ప్రజలు ఎల్లప్పుడూ మన పక్షాన ఉంటారు' అని ఆయన ప్రకటించారు. ప్రజల పరిశీలన, సమగ్ర అవినీతి వ్యతిరేక విచారణల ముందు ప్రతిపక్షం పన్నే రాజకీయ ఎత్తుగడలు చివరికి విఫలమవుతాయని ఆయన స్పష్టం చేశారు.

# ఆదివాసీల హక్కుల జోలికొస్తే ఖబడ్దార్




**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఆదివాసీల హక్కులను హరించే యత్నాలను అనుమతించబోమని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) నాయ కులు స్పష్టం చేశారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కు రాజ్యాంగం కల్పించిన ఐదో, ఆరో షెడ్యూళ్లను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఎఆర్ఎం ఆధ్వర్యంలో సోమవారం నాడిక్కడ ఢిల్లీ గేట్ సమీపంలోని షహీదీ పార్క్‌లో వేలాది మంది ఆదివాసీలు భారీ ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. 'భూమి, అడవులు మావే.. అదానీ, అంబానీలవి కావు' అంటూ నినదించారు. దేశవ్యా ప్తంగా 21 రాష్ట్రాల నుంచి ఆదివాసీ ప్రతిని ధులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఆదివాసీల భూములు, సహజ వనరులపై వారి హక్కులను పరిరక్షిం చాలని, అడవులను కార్పొరేట్ సంస్థలకు, మైనింగ్ ప్రాజెక్టులకు కేటాయించడాన్ని నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో ఆదివా సీలను నిర్వాసితు లను చేయవద్దని, వారికి ఉపాధి అవకాశాలు కల్పిం చాలని కోరారు. రిజర్వేషన్ల అమలులో ఉన్న సమస్య లను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు.వారి హక్కుల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ నాయకులు హెచ్చరిక చేశారు. సభలో ఎఎఆర్ఎం జాతీయ చైర్మన్ జితిన్ చౌదరి, జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీ పులీన్ బిహారీ బస్కే, జాతీయ ఉపాధ్యక్షురాలు బృందా కరత్, మాజీ ఎంపీ, సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు మిడియం బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, గిరిజన సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, కిల్లో సురేంద్ర, ఎఎఆర్ఎం జాతీయ నాయకులు అప్పలనర్స, తెలంగాణ కార్యదర్శి పూసం సచిన్, ఉపాధ్యక్షుడు రవికుమార్ తదితరులు ప్రసంగించారు. అభివృద్ధి, పారిశ్రామిక ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల భూములు, అడవులపై హక్కులను పరిమితం చేసే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులపై ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు.

**అటవీ హక్కుల చట్టాలను బలహీనపరుస్తున్నారు**

అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ), పీసా చట్టాలను సమర్థవంతంగా అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం కొత్త అటవీ సంరక్షణ చట్టం-2023ను తీసుకొచ్చిందని విమర్శించారు. దీనివల్ల ఆదివాసీ గ్రామసభల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని ధ్వజమెత్తారు. మైనింగ్ ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీలను భూముల నుంచి దూరం చేయడం సరికాదన్నారు. అడవులపై ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి కీలకమైన ఉపాధి హామీ పథకానికి బదులుగా కొత్త పథకాలను తీసుకురావడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఆదివాసీ జనాభా ప్రాతిపదికన ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో రిజర్వేషన్ల అమలులో ఉన్న సమస్యలను పరిష్కరించి, అర్హులైన ఆదివాసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో విద్యకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలల మూసివేతను నివారించాలని కోరారు. విద్యా బడ్జెట్‌లో కోతలు విధించడం వల్ల ఆదివాసీ విద్యార్థులకు నష్టం జరుగుతోందని విమర్శించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలపై ఏకపక్ష సాంస్కృతిక భావజాలాన్ని రుద్దడాన్ని వ్యతిరేకిస్తామని తెలిపారు. తమ సంస్కృతి, అస్తిత్వ పరిరక్షణకు పోరాటాలను కొనసాగిస్తామని పిలుపునిచ్చారు. ప్రయివేటు రంగంతో సహా అన్ని రంగాల్లో ఆదివాసీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఆదివాసీ విద్యకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్, పీసా చట్టాన్ని సమర్థ వంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కులను బలహీన పరిచే ప్రభుత్వ ప్రతిపాదనలను ఉపసంహరించు కోవాలని కోరారు. ఈ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు.

**రాష్ట్ర ప్రభుత్వాల తీరుపైనా ఆగ్రహం**

రాజ్యాంగం కల్పించిన ఆదివాసీ హక్కుల అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఎఎఆర్ఎం తెలంగాణ కార్యదర్శి పూసం సచిన్ , ఆంధ్రప్రదేశ్ నాయకులు కిల్లో సురేంద్ర, రామారావు తదితరులు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో హైడల్ పవర్ ప్రాజెక్టులను నిలిపివేయాలని, బాక్సైట్ తవ్వకాలను అనుమతించ వద్దని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో జీఓ నంబర్ 3ను పునరుద్ధరించి, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకు రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. తెలంగాణలో సాగులో ఉన్న ఆదివాసీల భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల భూములు, అస్తిత్వాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పీసా చట్టాన్ని అమలు చేయాలని, టైగర్ కారిడార్ల పేరుతో ఆదివాసీలను వారి నివాస ప్రాంతాల నుంచి తరలించే విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 49తో ప్రతిపాదించిన టైగర్ కారిడార్‌ను రద్దు చేయాలని కోరారు.

# 13వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

**- మాస్టర్ షాకీర్**



**కదిరి - సూర్య వాస్తవం**

కర్నూలు పార్లమెంట్ సభ్యులు నాగరాజు చేతుల మీదుగా మెడల్ ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న మహమ్మద్ కైఫ్ ఇటీవల 6వ తేదీ ఆదివారం కర్నూలు పట్టణంలోని పుష్ప రాజ్ కళ్యాణ మండపంలో జాతీయస్థాయి కరాటే పోటీలు జగదీష్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కరాటే పోటీలకు ముఖ్య అతిథులుగా ప్రారంభోత్సవానికి మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, ముగింపు కార్యక్రమానికి కర్నూలు పార్లమెంట్ సభ్యులు నాగరాజు హాజరయ్యారు. పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీ సత్య సాయి జిల్లాల కదిరి నుండి 20 మంది 35 మంది విద్యార్థులు కటా, కుమిటే విభాగాలలో పోటీ చేయగా 17 బంగారు, 6 వెండి, 8 కాంశ్య పథకాలు మొత్తం 31 పథకాలను సాధించారు ఈ పోటీలకు కదిరి నుండి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జైన్ పాఠశాల, శ్రీ శాంతినికేతన్ పాఠశాల నారాయణ, సెయింట్ మేరీ, శ్రీ చైతన్య పాఠశాల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొని మెడల్స్ సాధించారు వివరాలు మొహమ్మద్ కైఫ్ 2 బంగారు పతకాన్ని , రీదా ముస్కాన్ 1 బంగారు, రోషిని 1 వెండి,1 కాంశ్య, తణ్మయి 2 బంగారు, రబ్బాన్ 2 కాంస్య,గగన్ 2 బంగారు, దర్శన్ 1 బంగారు , దర్శిత్ 1 వెండి , మన్మయి 1 కాంశ్య, సంయుక్త 1 బంగారు, ఆద్య 1 వెండి, 1 కాంశ్య , ఫర్హాన్ 2 బంగారు, ఆఫ్నాన్ 1 బంగారు, ఉమర్ ఫరూక్ 1 బంగారు, 1 వెండి, ఆరుష్ 1 బంగారు, జస్వి 2 వెండి, హన్వి 1 బంగారు, 1 కాంశ్య, చేతన్ 2 కాంశ్య, రెహన్ 1 బంగారు, ఆరాధ్య 1 బంగారు, పథకాలను సాధించారు. కార్యక్రమం అనంతరం మాస్టర్ షాకీర్ కి మెమొంటోను అందజేశారు ఈ కార్యక్రమంలో మెడల్స్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు వారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.



## సంపాదకీయం

# మళ్లీ మొదటికి నీటి పంచాయితీ



కృష్ణా జలాల్లో వాటాల విషయంలో కొట్లాడుకుంటున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆరెస్ పార్టీల నేతలు.. అసలు విషయాన్ని పక్కన పెట్టి.. షాడో ఫైట్ చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటి వాటాలు ఉన్నా.. వాటిని వినియోగించు కునేందుకు తగిన ప్రాజెక్టులు ఏవని సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. కేటాయింపుల మేరకైనా నీటిని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ ఇంకా తెగలేదు. కృష్ణా జలాలపై తమ వాటాలపై ఇంకా ఎటూ తేలలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధ కృష్ణా బోర్డు ఆఫీసులో త్రిసభ్య కమిటీ భేటీ అయింది. కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నరసింహమూర్తి సమావేశం అయ్యారు. ఆగస్టు 25న జరిగిన సమావేశంలో చర్చలు కొలిక్కి రాకపోవడంతో బోర్డు సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. తిరిగి శుక్రవారం మరోసారి బోర్డు సమావేశం జరిగినా.. ఎలా ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నెల చివరి వారంలో మరోసారి జరిగే కృష్ణా బోర్డు సమావేశానికి కేఆర్ఎంబీ ఛైర్మన్ బోర్డు అధ్యక్షత వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోని నీటి నిల్వలను తాగునీటికే వినియోగించాలని మొదటిగా చర్చించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలకు ఎక్కువ భాగం తాగునీటిని సరఫరా చేయాలని, ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలకు 50% వాటా కింద నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు 200 టీఎంసీలు కేటాయించాలని కోరింది. తమ అవసరాలకు 104 టీఎంసీల కేటాయించాలని ఏపీ.. కృష్ణా బోర్డును కోరింది. ఏపీ, తెలంగాణలకు 66:34 నిష్పత్తిని అమలు చేస్తూ తక్షణమే తమకు 97 టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని ఏపీ కోరింది. అయితే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో 50 శాతం చొప్పున జలాలు కేటాయించాలని తెలంగాణ కోరింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని తెలంగాణ ఆరోపించింది. దీనిపై ఏపీ స్పందిస్తూ న్యాయబద్ధంగా వచ్చిన నీటి నుంచే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్నట్లు పేర్కొంది. అవసరం లేకున్నా.. తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి నీటిని దిగువకు వదులుతోందని పేర్కొంది. దానిని వెంటనే అడ్డుకోవాలని కోరింది. దీనికి తెలంగాణ స్పందిస్తూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ తరలిస్తున్న నీటిని వెంటనే నియంత్రణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో ఇరు రాష్ట్రాలు ఉమ్మడి జలాశయాల నుంచి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్ సూచించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటి విడుదలను ఏపీ నియంత్రించాలి. విద్యుదుత్పత్తికి నీటిని విడుదల చేయడాన్ని తెలంగాణ ఆపాలని కోరారని మినిట్స్‌లో తెలియజేశారు. పులిచింత, కేడీఎస్, తుంగభద్రతో సహా అనేక ప్రాజెక్టుల్లో, పెన్నా బేసిన్‌లో 80 టీఎంసీలు ఉన్నాయని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉమ్మడి జలాశయాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం ఉన్న నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఉమ్మడి జలాశయాల నుంచి 200 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరింది. అలాగే పాత విధానం కాకుండా రెండు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో సమానంగా నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్‌బాబు ప్రతిపాదించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తోందని, ఇటీవల ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కూడా అనుమతుల్లేకుండా జలాలను తోడేస్తోందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.తెలంగాణ డిమాండ్‌ను ఏపీ తీవ్రంగా తిరస్కరించింది. ప్రస్తుతానికి తక్షణ అవసరాల కోసం 97 టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. తమ వాటా పరిధిలోనే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నీటిని వాడుకుంటున్నామని స్పష్టం చేస్తూ.. తెలంగాణ డిమాండ్ చేసిన 200 టీఎంసీల కేటాయింపు సహేతుకం కాదన్నారు. పైగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నుంచి అనవసరంగా దిగువకు నీటిని విడుదల చేస్తోందని, దీనిని తక్షణమే నిలువరించాలని ఏపీ ఫిర్యాదు చేసింది.పోతిరెడ్డిపాడు 19 టీఎంసీలు, చెన్నై తాగునీటి కోసం 15 టీఎంసీలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అక్టోబరు వరకు 22 టీఎంసీలు తీసుకుంటామని ఏపీ చెప్పిందన్నారు. ఇప్పటికే 20 టీఎంసీలు వాడుకున్నారన్నారు. వెలిగొండ నుంచి కూడా వాడుకుంటూ.. ఇంకా పాత నిష్పత్తిలో నీటి కేటాయింపు కావాలని కోరడం సరికాదన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఏపీకి 104 టీఎంసీలు కావాలని కోరామని ఏపీ ఈఎన్సీ నరహింమూర్తి తెలిపారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలనడం సరికాదన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు కోసం కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ పనులు వేగవంతం చేసున్నా.. తెలంగాణ ప్రభు త్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో లేని నీటి వివాదాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని, ఆయన హయాంలో ఏపీ నాయకులు ఎందుకు ఇంత ధైర్యం చేయలేదని ప్రశ్నించారు. వరదలు లేని సమయంలో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడంలో ఆంతర్యమేందని నిలదీశారు. కాళేశ్వరం బరాజ్‌లు సురక్షితమేనని ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థలు స్పష్టత ఇచ్చిన తర్వాతైనా కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్‌చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు పంపులనూ ఆన్ చేయాలని కోరారు.సీఎం రేవంత్‌రెడ్డికి కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం కేవలం 6.5 టీఎంసీలే కావడం వల్ల భీమా, నెట్టెంపాడు, ఆర్డీఎస్ కింద లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోనే వలసల జిల్లా పాలమూరు రూపురేఖలు మారాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చాక పాలమూరు బిడ్డలు మళ్లీ వలసబాట పట్టే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యకం చేశారు.




# చిట్టీల పేరుతో టోకరా...!!

- నమ్మించి మోసం చేసి.. ఇంటికి తాళం వేసి.. పారిపోయిన వీరారెడ్డి!!
- విబి.జీ రాంజీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉన్న వీరారెడ్డి
- లబోదిబోమంటున్న బాధితులు
- న్యాయం చేయాలని ఎమ్మెల్యే కందికుంటను ఆశ్రయించిన బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



**శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో – సూర్య వాస్తవం :** వడ్డీ వ్యాపారంలో అపార అనుభవం.. అందరితోను కలివిడిగా మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీల్లో నమ్మకం కుదుర్చుకున్నాడు.. ఆ నమ్మకం అందరిలోనూ బలంగా ఉండిపోయింది.. ప్రతి ఒక్కరితోనూ మంచిగా ఉంటూ అందిన కాటికి డబ్బులు లక్షలాది రూపాయలను ఇప్పించుకున్నాడు. మీ డబ్బుకు ఎక్కడ డోకా లేదు మీకు వడ్డీకి వడ్డీ ఇస్తాను లేదంటే చిట్టీలు కూడా వేసుకోండి అంటూ అందరితోనూ నమ్మబలికాడు దీంతో నమ్మిన ప్రజలు ఈ వ్యక్తికి లక్షలాది రూపాయలను ఇచ్చారు. ఆఖరుకు తాను ముందుగా రచించుకున్న వ్యూహం ప్రకారం కదిరి ఖాళీ చేసి ఉన్నట్టుండి అదృశ్యమయ్యాడు. ఈయనకు లక్షలాది రూపాయల డబ్బులను ఇచ్చిన బాధితుల గుండెలు గుబేలు అనే విధంగా చేశాడు కదిరి పట్టణం వైయస్సార్ నగర్ లో కాపురం ఉంటున్న వీరారెడ్డి అనే వ్యక్తి. ఈయన శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజక వర్గం తన కల్లు మండలం ఎంపీ డీవో కార్యాలయం లో వి.బి.జీ రాంజీ పథకంలో టెక్ని కల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిం చేవాడు. ఈయన కదిరి ప్రాంతంలో అందరికీ సుపరిచి తుడే. చాలా కాలం నుంచి వడ్డీ వ్యాపారం చిట్టీలు నడుపుతూ ఉండేవాడు అందువల్ల ఉద్యోగులు వ్యాపారస్తులు ఇతని నమ్మి ఈయన వద్ద చీటీలు వేసేవారు. చాలా కాలంగా తన వద్ద చిట్టీలు వేసే వారికి మాయమాటలు చెప్పి ముందుగానే ఒక్కొక్కరి దగ్గర నుంచి లక్షలాది రూపా యలను ఇప్పించుకునే వాడు. అందులోనూ ఈయనకు ఉద్యోగం ఉందనే నమ్మకంతో అందరూ ముందుగానే డబ్బులు ఇచ్చేశారు వీరారెడ్డి వీరందరికీ నమ్మించి తాను అనుకున్న పథకం ప్రకారం వ్యూహరచన ముందుగానే రచించి ఇంటికి తాళం వేసుకొని భార్యాభర్తలిద్దరూ కదిరి వదిలి వెళ్ళిపోయారు. కొందరు బాధితులు వీరారెడ్డి సెల్ కు కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో అప్పటినుంచి ఆయన గురించి ఆరా తీయడం ప్రారంభించారు. ఆఖరుకు కొందరు ఆయన ఇంటి వద్దకు వెళ్లి చూసినప్పుడు అసలు విషయం బయటకు వచ్చింది. ఈ విషయం ఆ నోట ఈ నోట పడి బహిరంగ చర్చకు రావడంతో అసలు విషయం వీరారెడ్డి వద్ద చీటీలు వేస్తున్న మిగిలిన వారికి కూడా తెలియడంతో వారు ప్రస్తుతం లబోదిబోఅంటూ తల బాదు కుంటున్నారు. ఒక్కొక్కరి దగ్గర 30 లక్షలు 10 లక్షలు 40 లక్షలు వారి స్థాయిని బట్టి వీరారెడ్డి ముందుగానే ఇప్పించు కొని తాను అనుకున్న పని కాని చేశాడు అయితే బాధితుల సంఖ్య రోజురోజుకు చేంతాడంత పెరిగిపోతూ పుట్టగొడు గుల బయటకు వస్తున్నారు. వీరారెడ్డి దాదాపు 6నుంచి 11కోట్ల వరకు అందరికీ ఎగనామం పెట్టి పారిపోయి నట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది. అయితే వీరారెడ్డి కదిరి పట్టణాన్ని వదిలి వేరే ఊరికి పారిపోవడానికి ప్రధాన కారణం ఆయన సమీప బంధువు చిన్న రెడ్డి హస్తం కీలకంగా ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. కాగా వీరారెడ్డి పారిపోవడంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని తాను ఎక్కడికి వచ్చి చెప్పమన్న సమాధానం చెబుతానని చిన్న రెడ్డి అంటున్నారు. అందరికీ నమ్మకంగా ఉండి ఇలా చేయడం వల్ల వీరారెడ్డి పట్ల ప్రజలు అసహించుకుంటు న్నారు మొబైల్ స్విచ్ ఆఫ్ చేసి ఎక్కడు న్నాడో ఏంటో అంటూ బాధితులు విచారణ చేస్తున్నారు. కాగా కదిరి నుంచి పారిపోయిన వీరారెడ్డి తన వద్ద చిట్టీలు వేసిన వారికి ఐపి నోటీసులు కూడా పంపించ డానికి అన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. చీటీలు వేసి తాము పూర్తిగా నష్టపోయామని నమ్మినం దుకు ఆయన తమను నట్టేట ముంచి పారిపోయాడని వీరారెడ్డి నుంచి తమకు న్యాయం కావాలని బాధితులు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆశ్రయిం చారు. అదేవిధంగా ఒకటి పాయింట్ 20 లక్షలు తమకు మోసం చేశాడని సుమారు 15 మంది బాధితులు అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు కు ఫిర్యా దు చేశారు. అయితే బాధితుల ఫిర్యాదు వరకు జరిగిన విషయాన్ని విచారిస్తున్నామని అర్బన్ సీఐ తెలిపారు.

# రైతుల సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి...!

- సాగునీరు, విద్యుత్, కరువు సమస్యలపై వినతిపత్రం
- పెరూరు డ్యామ్‌కు నీరు నింపాలి.. రైతులకు విద్యుత్ అందించాలి
- 52 టీఎంసీల నీటి హామీ ఏమైంది..?
- సబ్‌స్టేషన్ల ఎదుట రైతులు ధర్నాలు చేసే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్న
- రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన తోపుదుర్తి



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** రైతుల సాగునీరు, విద్యుత్, కరువు సమస్యలపై రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.చాలా సంవత్సరాల తర్వాత రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నాలు చేసే పరిస్థితి రావడం ఆందోళనకరమని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్ కూడా అందని పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### వైఎస్సార్ హయాంలో 7 గంటలు.. జగన్ హయాంలో 9 గంటలు

మహానేత డాక్టర్ వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు 7 గంటల విద్యుత్ సరఫరా విధానాన్ని తీసుకొచ్చారని, అనంతరం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దానిని 9 గంటలకు పెంచిందని గుర్తు చేశారు.అయితే ప్రస్తుతం రైతులకు అవసరమైన స్థాయిలో విద్యుత్ అందకపోవడంతో పంటలు సాగు చేసుకోవడం కష్టంగా మారిందన్నారు. రైతు ఏ పార్టీకి చెందినవాడైనా పంట పండితే అందరికీ పండుగేనని, పంట పండకపోతే ప్రతి రైతూ నష్టపోతాడని పేర్కొన్నారు.

### పెరూరు డ్యామ్‌ను ఎందుకు నింపలేదు?

రాప్తాడు నియోజకవర్గంలోని అతిపెద్ద జలాశయమైన పెరూరు డ్యామ్‌కు నీరు నింపాలని ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లోనే జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ప్రకాష్ రెడ్డి తెలిపారు.పెరూరు డ్యామ్‌ను సుమారు 2 టీఎంసీల నీటితో నింపగలిగితే రాబోయే రెండు, మూడు సంవత్సరాల పాటు రైతులకు సాగునీటి భరోసా కల్పించే అవకాశం ఉంటుందని చెప్పారు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోయినా వేలాది ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించవచ్చున్నారు.స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా కలెక్టర్‌కు, జిల్లా నాయకుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినా పెరూరు డ్యామ్‌కు నీరు నింపే విషయంలో సరైన చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

### కాలువల లైనింగ్‌తో భూగర్భ జలాలకు నష్టం

కాలువలకు లైనింగ్ చేయడం వల్ల భూగర్భ జలాల రీచార్జ్ తగ్గే ప్రమాదం ఉందని రైతులు, నిపుణులు హెచ్చరించినా వాటిని పట్టించుకోకుండా పనులు చేపట్టారని ఆరోపించారు.దీని ప్రభావం జిల్లాలోని రైతులపై పడుతోందని తెలిపారు. ముఖ్యంగా హిందూపురం పార్లమెంట్ పరిధిలోని రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పీఏబీఆర్ కుడి కాలువ కింద అనంతపురం రూరల్, కుడేరు, ఆత్మకూరు, తాడిమర్రి, ధర్మవరం, కనగానపల్లి మండలాలు ఉన్నప్పటికీ ఆయా ప్రాంతాలకు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### 52 టీఎంసీల నీటి హామీ ఏమైంది?

హెచ్ఎల్సీ , హంద్రీనీవా ద్వారా 16 టీఎంసీలకు మించి నీరు రాని పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్న నేపథ్యంలో గతంలో 52 టీఎంసీల నీటిని తీసుకొస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు.ఆ నీరు ఎక్కడికి వచ్చిందో, రిజర్వాయర్లలో ఉందో, చెరువుల్లో ఉందో ప్రభుత్వం ప్రజలకు, రైతులకు స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు.వర్షాలు పడకపోతే పరిస్థితి ఇలాగే ఉంటుందని అధికారులకు ముందే తెలుసని, అలాంటప్పుడు కాలువలకు లైనింగ్ ఎందుకు చేశారని, పెరూరు డ్యామ్‌కు నీరు ఎందుకు నింపలేదని ప్రశ్నించారు.

### తక్కువ వోల్టేజీతో కాలిపోతున్న మోటార్లు

అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో భూగర్భ జలాల ఆధారంగా వ్యవసాయం చేస్తున్న రైతులు విద్యుత్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సబ్‌స్టేషన్ల నుంచి 300 వోల్టుల విద్యుత్ రావాల్సిన చోట 100 నుంచి 150 వోల్టులు మాత్రమే వస్తున్నాయని, దీంతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని వెల్లడించారు.మూడు అంగుళాల నీరు రావాల్సిన చోట అర అంగుళం నీరు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ కొరత కారణంగా పంటలకు నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### రైతులకు విద్యుత్ కొనుగోలు చేయడానికి డబ్బులు లేవా?

విద్యుత్ శాఖ, అధికారులు విద్యుత్ కొరత ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన విద్యుత్ కొనుగోలు చేయడం లేదని చెబుతున్నారని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సాగును కాపాడేందుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

### ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ప్రస్తుత కరువు పరిస్థితులు, సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులు బాధ్యత వహించా లని ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని సూచించారు. పెరూరు డ్యామ్‌కు నీరు నిం పడం, రైతులకు తగినంత విద్యుత్ అందించడం, కాలు వల ద్వారా నీటి సరఫరాను మెరుగుపరచడం, కరువు పరిస్థితుల్లో రైతులను తక్షణమే ఆదుకోవాలని కోరారు. రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది.. వ్యవసాయం బతికితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బతుకు తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు.



# అదుపుతప్పి బోల్తాపడిన ఆటో..

- ఘటనాస్థలంలోనే వృద్ధుడి మృతి...!
- మరో ముగ్గురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు..వివరాల సేకరణ



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** పట్టణ శివారులోని గుంతకల్ రహదారిపై సోమవారం ఉదయం ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలికి చెందిన ఆటో ప్రయాణికులతో ఉరవకొండకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన అంజనేయ (65) తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడగా, వారికి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

# జిల్లా స్థాయి క్రీడల్లో...
# చిన్న హోతూరు విద్యార్థుల సత్తా...!

- కోకో అండర్--14 బాలుర విభాగంలో జిల్లా ఛాంపియన్‌షిప్ కైవసం
- అథ్లెటిక్స్‌లోనూ అవార్డులు సాధించిన విద్యార్థులు
- విజేతలకు అవార్డులు అందజేసిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్




**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో వజ్రకరూరు మండలం చిన్న హోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా కలెక్టర్, డీఎస్ఈవో, ఏసీఎఫ్, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కోకో అండర్--14 బాలుర విభాగంలో చిన్న హోతూరు జట్టు విజేతగా నిలిచి జిల్లా ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.అదేవిధంగా అథ్లెటిక్స్ విభాగంలోనూ చిన్న హోతూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 600 మీటర్ల పరుగులో మూడో స్థానం, 200 మీటర్ల పరుగులో రెండో స్థానం, రిలే విభాగంలో రెండో స్థానాన్ని సాధించి పాఠశాలతో పాటు గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకొచ్చారు.విజేతలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంలో కృషి చేసిన పీడీ ప్రభాకర్‌తో పాటు పాఠశాల సిబ్బందిని అభినందించారు.విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు ఆకాంక్షించారు. జిల్లా స్థాయి పోటీల్లో చిన్న హోతూరు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడంపై గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# రాష్ట్రస్థాయి
# ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు...!

- విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేయాలని ఆకాంక్ష
- అవార్డు గ్రహీతలను అభినందించిన ఏడీ-1 పఠాన్ మునీర్ ఖాన్

**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారులు అభినందించారు. గుత్తి కేజీబీవీలో సీఆర్‌టీ (బయాలజీ)గా పనిచేస్తున్న గౌరీ ప్రభాంజలి, గుత్తి మండలం చెట్నేపల్లి జెడ్పీ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు సామ్యూల్ ప్రతాప్, కళ్యాణదుర్గం మండలం ఎం.కొండాపురం ఎస్టీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయుడు గోవర్ధన్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలు సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి విచ్చేసి డీఈఓతో పాటు ఏడీ-1 పఠాన్ మునీర్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏడీ-1 వారిని అభినందించి, ఇదే స్ఫూర్తితో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఏఎంఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల ఫలితాలపై
# పగటి కలలు కంటున్న కూటమి నాయకులు...!

- ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది
- స్థానిక ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెబుతారు
- వైసీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు బాకే హబీబుల్లా



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను మర్చిపోయి నిద్రిస్తున్న కూటమి నాయకులు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమదే విజయమని పగటి కలలు కంటున్నారని వైఎస్‌ఆర్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అనంతపురం జిల్లా అధ్యక్షులు బాకే హబీబుల్లా విమర్శించారు.అధికార బలంతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామని ధీమాగా ఉన్న కూటమి పార్టీలకు.. వారి పాలనపై నిరాశతో ఉన్న రాష్ట్ర ప్రజలు ఈ ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతారని అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి పార్టీలు ఉమ్మడి ప్రజాగళం మేనిఫెస్టోలో ఇచ్చిన అనేక హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యాయని ఆరో పించారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, మహిళలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాకపోవడంతో ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. కేవలం రాజధాని అభివృద్ధి పేరుతో వేల కోట్ల రూపాయలు అప్పుగా తెచ్చి రాష్ట్ర ప్రజలపై అప్పుల భారం మోపుతున్నారే తప్ప.. వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమ ర్శించారు. కర్నూలులో ఏర్పాటు చేస్తామన్న హైకోర్టు బెంచ్ హామీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని అన్నారు. కూటమి పాలనలో రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, దాని ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా కనిపి స్తుందని బాకే హబీబుల్లా తెలిపారు. రాష్ట్రంలోని కాపులు, మైనార్టీలు, బీసీ వర్గాలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో కూటమి ప్రజాప్రతినిధులపై వస్తున్న అవినీతి ఆరోపణలు కూడా ఎన్నికల్లో ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత వైఎస్‌ఆర్‌సీపీకి అనుకూలంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులు సవాల్‌గా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కష్టపడి పనిచేసి.. వైఎస్ జగన్ నాయకత్వంలో ఘన విజయం సాధిస్తామని బాకే హబీబుల్లా పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి పోలీసు క్రీడల్లో అనంతపురం పోలీసుల సత్తా...!

- 36 పతకాలు కైవసం.. 4 స్వర్ణం, 22 రజతం, 10 కాంస్య పతకాలు
- విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** రాష్ట్రస్థాయి పోలీసు క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా పోలీసులు సత్తా చాటారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 36 పతకాలు సాధించారు. ఇందులో 4 స్వర్ణ, 22 రజత, 10 కాంస్య పతకాలు ఉన్నాయి.

**15 క్రీడా విభాగాల్లో ప్రతిభ**

హైజంప్‌లో స్వర్ణం, షాట్‌పుట్‌లో కాంస్యం, కరాటేలో స్వర్ణం, వెయిట్‌లిఫ్టింగ్‌లో స్వర్ణం, రెజ్లింగ్‌లో ఒక స్వర్ణం, మూడు రజతాలు సాధించారు. డెకాథ్లాన్‌లో రజత పతకం దక్కింది. యోగాలో రెండు రజతాలు, రెండు కాంస్యాలు, షటిల్ బ్యాడ్మింటన్‌లో కాంస్యం, 800 మీటర్ల పరుగులో రజతం, ఏఐపీడీఎంలో రజతం, నార్కోటిక్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. క్రికెట్‌లో 14 మంది క్రీడాకారులు రజత పతకాలు సాధించగా, ఖోఖోలో కాంస్యం, ఫుట్‌బాల్‌లో మూడు కాంస్య పతకాలు, మారథాన్‌లో కాంస్య పతకం సాధించారు. మొత్తం 15 క్రీడా విభాగాల్లో జిల్లా పోలీసులు తమ ప్రతిభను చాటుకున్నారు.

**విజేతలకు ఎస్పీ అభినందనలు**

రాష్ట్రస్థాయి పోలీసు క్రీడల్లో విజేతలుగా నిలిచిన పోలీసు అధికారులు, సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను కలిశారు.

ఈ సందర్భంగా ఎస్పీ విజేతలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.క్రీడల్లో రాణించడం వల్ల పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని ఎస్పీ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా పోలీసులకు మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరింతగా రాణించి అనంతపురం జిల్లా పోలీసుల ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, సీఐ జయపాల్ రెడ్డి, ఆర్ఎస్ఐ బాబ్జాన్ తదితరులతో పాటు డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ వినియోగదారుల సదస్సుకు
# బీఐఎస్ డైరెక్టర్‌కు ఆహ్వానం...!

- పుట్టపర్తిలో సెప్టెంబర్ 12, 13న 16వ జాతీయ వినియోగదారుల సదస్సు
- నాణ్యతపై అవగాహనే వినియోగదారుల భద్రతకు పునాది: క్యాప్కో ఛైర్మన్ జి.సురేష్ కుమార్




**అనంతపురం - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా పుట్టపర్తి వేదికగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు బీఐఎస్ విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ ప్రేమ్ సజని పట్నాలను ఆహ్వానించినట్లు క్యాప్కో ఛైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు. క్యాప్కో గౌరవ అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు, మచిలీపట్నం వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు సైకం భాస్కరరావుతో కలిసి ఆమెను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో), జాతీయ వినియోగదారుల సంఘాల సమాఖ్య (సీసీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సుకు గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించాలని బీఐఎస్ డైరెక్టర్‌ను కోరినట్లు సురేష్ కుమార్ తెలిపారు.

**'నాణ్యత--భద్రత--ప్రమాణాలు'పై అవగాహన**

సదస్సులో భాగంగా 'నాణ్యత--భద్రత--ప్రమాణాలు' అనే అంశంపై ప్రత్యేక బీఐఎస్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఐఎస్ ప్రమాణాలు, ఐఎస్ఐ మార్క్, నాణ్యత ధృవీకరణ, ప్రమాణాలకు అనుగుణమైన ఉత్పత్తుల ఎంపిక, వినియోగదారుల భద్రత తదితర అంశాలపై బీఐఎస్ నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

**వినియోగదారుల సమస్యలపై విస్తృత చర్చ**

కల్తీ, నాసిరకం ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, ఆన్‌లైన్ మోసాలు, తూనికలు--కొలతల్లో అక్రమాలు, సేవల్లో లోపాలు తదితర ప్రధాన వినియోగదారుల సమస్యలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.

బీఐఎస్ సాంకేతిక సహకారం, నిపుణుల భాగస్వామ్యం జాతీయ వినియోగదారుల సదస్సుకు మరింత విలువను చేకూరుస్తుందని క్యాప్కో ఛైర్మన్ జి. సురేష్ కుమార్ పేర్కొన్నారు. "నాణ్యతపై అవగాహన--వినియోగదారుల భద్రతకు బలమైన పునాది" అనే లక్ష్యంతో సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచాలి

**- జిల్లా ఎస్పీ పి. జగదీష్...!**
**- బాధితుల అర్జీలకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారించాలి**
**- ప్రతి అర్జీపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఆదేశం**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జి ఆర్ ఎస్ ) ద్వారా బాధితుల నుంచి స్వీకరించే అర్జీలను నిర్ణీత వ్యవధిలో విచారించి పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అధికారులను ఆదేశించారు.
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల 71 వినతులను ఎస్పీ నేరుగా స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూవివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు అందజేశారు.ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా, జవాబుదారీతనంతో విచారణ చేపట్టి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. "బాధితులకు అండగా... ప్రజల నమ్మకమే బలంగా..." అనే లక్ష్యంతో జిల్లా పోలీసు శాఖ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# బెళుగుప్పలో వైకుంఠ రథం ప్రారంభం...




**బెళుగుప్ప– సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన బెళుగుప్పలో సోమవారం నూతన వైకుంఠ రథాన్ని ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శీనప్పల సహకారంతో, వారి తల్లిదండ్రులు కీర్తిశేషులు పయ్యావుల ఓబుళమ్మ, పయ్యావుల వెంకటనారాయణప్పల జ్ఞాపకార్థం గ్రామ ప్రజల సౌకర్యార్థం ఈ వైకుంఠ రథాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తిప్పయ్య, మల్లికార్జున, మండల కన్వీనర్ సునీల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో అంతిమ యాత్రలకు ఇబ్బందులు కలగకుండా మంత్రి పయ్యావుల కేశవ్ కుటుంబ సభ్యులు తమ తల్లిదండ్రుల స్మారకార్థం వైకుంఠ రథాన్ని బహూ కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు కూడా పాల్గొన్నారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి మంజులతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని వైకుంఠ రథాన్ని ప్రారంభించారు.

# పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌కు... పెద్ద సంఖ్యలో అర్జీలు...!

**- ప్రజల నుంచి 471 వినతులు స్వీకరించిన అధికారులు**
**- వివిధ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించిన ప్రజలు**
**- అర్జీలు పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశం**

**అనంతపురం కలెక్టరేట్ – సూర్యా వాస్తవం :** జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ విష్ణుచరణ్, డీఆర్వోతో పాటు ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా మొత్తం 471 వినతులు అందినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



# ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తులు...!

**- సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**- 2024కు ముందు దరఖాస్తు చేసి పింఛను రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ వెల్లడి**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లు గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్ కేటగిరీలకు చెందిన అర్హులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ వంటి సంబంధిత పత్రాలను అందజేయాలని సూచించారు. దరఖాస్తులను సంబంధిత సచివాలయ సిబ్బంది స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని, అనంతరం ఈ–కేవైసీ, భౌతిక పరిశీలన, అర్హత పరిశీలన వంటి ప్రక్రియలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సిఫార్సు చేస్తారని, తుది మంజూరు రాష్ట్రస్థాయి పరిశీలనకు లోబడి ఉంటుందని పేర్కొన్నారు. 2024కు ముందు పింఛను కోసం దరఖాస్తు చేసి, ఇప్పటివరకు పింఛను మంజూరు కాని వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.పింఛన్ల మంజూరు, విడుదల ప్రభుత్వ అనుమతి, నిబంధనలు, బడ్జెట్ లభ్యతకు లోబడి ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 16లోపు సంబంధిత స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయంలో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఓ. ఆనంద్ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ గోడలపై రాజకీయ రాతలు.. అధికారుల మౌనం ఎందుకు..?

**- పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీ గోడలు, డివైడర్లపై రాజకీయ పార్టీ పేర్లు, నినాదాలు**
**- అనుమతులు లేకుండా బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు**
**- ప్రజా ఆస్తుల పరిరక్షణపై అధికారులు దృష్టి సారించాలనే డిమాండ్**

**ఉరవకొండ – సూర్య వాస్తవం :** ఉరవకొండ పట్టణంలో ప్రభుత్వ, ప్రజా ఆస్తులపై రాజకీయ ప్రచారం చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వ కార్యాలయాల గోడలు, విద్యాసంస్థల గోడలు, రహదారి డివైడర్లు తదితర ప్రాంతాల్లో రాజకీయ పార్టీల పేర్లు, నినాదాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద అనుమతులు లేకుండా బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ ప్రచారం ఎంతవరకు సమంజసం..?**

ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా వినియోగంలోని భవనాలు, రహదారులు, డివైడర్లు ప్రజలందరికీ చెందిన ఆస్తులు. వీటిని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం, అనుమతి లేకుండా గోడలపై రాతలు రాయడం లేదా పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధంగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ప్రజా ఆస్తులపై డిఫేస్‌మెంట్‌కు సంబంధించిన నిబంధనలు మరింత కఠినంగా అమలవుతాయి.

**కాలేజీ గోడలపైనా ఇదే పరిస్థితి..**

పట్టణంలోని కొన్ని విద్యాసంస్థల గోడలపై కూడా రాజకీయ రాతలు కనిపిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రదేశాలు కావడంతో అక్కడ రాజకీయ ప్రచారానికి సంబంధించిన రాతలు, పోస్టర్లు ఏర్పాటు చేయడంపై సంబంధిత అధికారులు, యాజమాన్యాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**డివైడర్లపై బ్యానర్లు ఎవరి అనుమతితో..?**

ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న డివైడర్లు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న బ్యానర్ల విషయంలోనూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మున్సిపల్ అనుమతులు తీసుకున్నారా? ట్రాఫిక్‌కు, ప్రజల భద్రతకు ఇబ్బంది కలిగించేలా బ్యానర్లు ఏర్పాటు చేశారా? అనే అంశాలపై అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.
అధికారులు స్పందించాల్సిన సమయం..ప్రభుత్వ, ప్రజా ఆస్తులపై అనధికారికంగా రాసిన రాజకీయ నినాదాలు, ఏర్పాటు చేసిన బ్యానర్లపై సంబంధిత మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించేలా చర్యలు ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, డివైడర్లు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన రాజకీయ రాతలు, బ్యానర్లపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తారా? అక్రమంగా ఉన్న వాటిని తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాలి.



# ఉరవకొండలో ఫీవర్ సర్వే...

**– దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు...!**
**- డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా లక్షణాలు, నివారణ చర్యలపై ఇంటింటి ప్రచారం - సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన**

**ఉరవకొండ టౌన్ – సూర్య వాస్తవం :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. సోమవారం ఉరవకొండ పట్టణంలోని ఒకటో, రెండో సచివాలయాల పరిధిలోని పలు కాలనీలు, వీధుల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యనిర్వహణ అధికారి సయ్యద్ సమీర్, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్‌యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా పలు కాలనీల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు.

**దోమల నివారణకు చర్యలు**

పట్టణంలోని పలు ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మలేరియా సిబ్బంది క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడంతో పాటు మురుగుకాలువల్లో ఏబేట్ ద్రావణాన్ని చల్లారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమల వృద్ధిని అరికట్టే చర్యలు చేపట్టారు.ప్రజలు దోమల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అధికారులు సూచించారు. తప్పనిసరిగా దోమతెరలను వినియోగించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు.

**గంబోషియా చేపలతో దోమల లార్వాలకు చెక్**

నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల గుడ్లు, లార్వాలను నశింపజేసేందుకు త్వరలో ఎంపీడీవో బి.వి. రవిప్రసాద్ చేతుల మీదుగా గంబోషియా చేప పిల్లలను వదిలే కార్యక్రమం చేపడతామని అధికారులు తెలిపారు.మలేరియా నుంచి రక్షణ పొందేందుకు సాయంకాలం వేళల్లో వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ఇంటి బయట లేదా ఆరుబయట నిద్రించే సమయంలో పొడవాటి దుస్తులు ధరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ఫీవర్ సర్వే, అవగాహన కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ శమంతకమణి, ఏఎన్‌ఎం, ఆశా ఆరోగ్య కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక శిబిరాలతో ఎంబీయూ పూర్తి చేయాలి

**- కలెక్టర్ ఓ. ఆనంద్...! - 0-5 ఏళ్ల చిన్నారుల్లో 51,446 ఆధార్ పెండింగ్**
**- పిల్లల ఆధార్ పెండెన్సీకి మూడు నెలల్లో చెక్! - ఆధార్ కేంద్రాల్లో అధిక రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు**

**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** జిల్లాలో పిల్లల ఆధార్ నమోదు, నవీకరణతో పాటు పెండింగ్‌లో ఉన్న తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ ( ఎంబీయూ ) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి ఆధార్ మాని టరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆధార్ నమోదు, నవీకరణ, పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్ పెండెన్సీ, ఆధార్ సేవా కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు.

**51,446 మంది చిన్నారుల ఆధార్ పెండింగ్**

జిల్లాలో 0--5 సంవత్సరాల పిల్లలకు సంబంధించి 51,446 ఆధార్ పెండెన్సీ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పెండెన్సీని తగ్గించేందుకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, అంగన్వాడీ కేంద్రాలు, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రతి నెల రెండుసార్లు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ శిబిరాల్లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు.

**పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు**

పాఠశాల విద్యాశాఖ పరిధిలో 5--15 సంవత్సరాల పిల్లలకు సంబంధించి 44,221 ఎంబీయూ పెండెన్సీ, జూనియర్ కళాశాలల్లో 5--17 సంవత్సరాల విద్యార్థులకు 23,535 ఎంబీయూ పెండెన్సీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఎంబీయూ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్ఐఓలను కలెక్టర్ ఆదేశించారు.

**మూడు నెలల్లో పెండెన్సీకి పరిష్కారం**

స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు ఆధార్ సేవా కేంద్రాల సహకారంతో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన ఆధార్ పెండెన్సీని రాబోయే మూడు నెలల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించేలా అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**అధిక రుసుములు వసూలు చేస్తే చర్యలు**

ఆధార్ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం, యూఐడీఏఐ నిర్దేశించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఆధార్ సేవా కేంద్రంలో అందించే సేవలకు సంబంధించిన నిర్దేశిత రుసుముల వివరాలతో కూడిన పోస్టర్‌ను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలో అర్హత కలిగిన ప్రతి బాలబాలికకు ఆధార్ నమోదు, నవీకరణ, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు.



## రేణిగుంట విమానాశ్రయంలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఘనస్వాగతం పలికిన మంత్రి సత్య కుమార్...తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి,నెల్లూరు జిల్లాలలో ఒకరోజు పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న,ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్,తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఘన స్వాగతం పలికారు.వీరితోపాటు శ్రీకాళహస్తి ఆర్డిఓ బానుప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు,బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్,ప్రజాప్రతినిధులు తదితరులుస్వాగతం పలికారు.అనంతరం ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంతి హెలికాప్టర్లో నెల్లూరు జిల్లాలోని వెంకటాచలంలోని స్వర్ణ భారతీ ట్రస్ట్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్దిపూడి రాజారెడ్డిని సన్మానించిన నియోజకవర్గ ఇన్చార్జ్ కిరణ్ కుమార్



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సూళ్లూరుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దిపూడి రాజారెడ్డి ని సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డి.కిరణ్ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వారికీ సన్మానించారు.ఈ సందర్భంగా డి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.పార్టీ బలోపేతానికి సీనియర్ నాయకులుగా రాజారెడ్డి తన వంతు కృషి చేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నం బాకం హరికృష్ణ,కిసాన్ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు జోగి వినోద్,సూళ్లూరుపేట మండల కార్యదర్శి బొగ్గుల సురేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణల ఆరోపణలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

**- వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిపై టీడీపీ నేతల వినతి**
**- భూ రికార్డుల ఆధారాలు సమర్పించాం.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** పెళ్లకూరు మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి భూ ఆక్రమణలకు పాల్ప డ్డారని ఆరోపిస్తూ పలువురు తెలుగు దేశం పార్టీ నాయకులు పీజీ ఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. సోమ వారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.భూ రికార్డులకు సంబంధించిన ఆధారాలను సైతం అధికారులకు అందజేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. సంబంధిత భూములపై సమగ్రంగా విచారణ నిర్వహించి, రికార్డులను పరిశీలించాలని వారు కోరారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలపై కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను కోరినట్లు వెల్లడించారు.ప్రభుత్వ భూములు, ప్రజలకు సంబంధించిన భూముల విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. తాము సమర్పించిన పత్రాలు, భూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, మధుసూదన్ నాయుడు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శిరసనంబేడు చైతన్య కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి, లోకేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్త సోహెల్ వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** సూళ్లూరుపేటలోని జె వి ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సోహెల్ గారి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి పొలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి,సూళ్లూరుపేట మాజీ శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య వైఎస్ఆర్సీపీ నెల్లూరు జిల్లా యూత్ అధ్యక్షులు మేరుగ చక్రవర్తి వైఎస్సార్‌సీపీ సూళ్లూరుపేట మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ అబ్జర్వర్ జెట్టి వేణు యాదవ్ వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి అలవల సురేష్ సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు వెల్లపాలెం కృపాకర్ రెడ్డి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి,ఐత శ్రీధర్ తుపాకుల ప్రసాద్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బందిలి మహేష్ పర్వత రెడ్డి రవి రెడ్డి,వాకాటి బాబు రెడ్డి ఎర్రపు రెడ్డి బాబు రెడ్డి,మల్లికార్జున రెడ్డి,రాకేష్ యాదవ్ భగవాన్ దాస్ ఆర్.కృష్ణయ్య, ప్రతాపరెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు వారి వైవాహిక జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

# ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ

**- మా పాత్ర తగ్గదు,మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం**




**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ పూర్తిస్థాయిలో తెరదించింది.ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని,దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది.ఈ మేరకు 'ఎక్స్'వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది."ఇస్రోను ప్రైవేటీకరించరు,దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి,వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం,అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది"అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది.అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని,మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది.2020లో ప్రారంభమైన సంస్కరణలు,2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన,ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది.దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని,భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం,సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.సాంకేతికంగా అభివృద్ధి చెందిన,పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు,సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ)కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది.ఇది"ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది."భవిష్యత్ లక్ష్యాలు ఇవే.":-భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది.ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు,చంద్రుడు,ఇతర గ్రహాలపై పరిశోధనలు,2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్'ఏర్పాటు,2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం.ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని,దీనికి ప్రైవేట్ పెట్టుబడులు,పారిశ్రామిక సామర్థ్యం,ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు,నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.



# త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ సర్వసన్నాధం

- అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకు బదులు సీనియర్లకు అప్పగింత
- మిత్రపక్షాలతో సమన్వయం,ప్రచారంపై ఇన్‌ఛార్జ్‌లకు కీలక బాధ్యతలు
- ఫలితాల్లో తేడా వస్తే ఒప్పుకోనని కుప్పం నేతలకు చంద్రబాబు హెచ్చరిక
- మిత్రపక్షాలైన జనసేన,బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి కీలక బాధ్యతలు -ఇన్‌ఛార్జ్‌లు దే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం-కూటమి వ్యూహం



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సర్వసన్నద్ధమవుతోంది.ఈ దిశగా ఎన్నికల కసరత్తును వేగవంతం చేస్తూ,రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈసారి సరికొత్త వ్యూహాన్ని అనుసరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసారి అభ్యర్థుల ఎంపిక బాధ్యతను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా ఎంపీలు,ఎమ్మెల్సీలు, పార్టీలోని ఇతర కీలక నేతలకు అప్పగించారు. అభ్యర్థుల ఎంపిక,ఎన్నికల ప్రచారం,క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను క్రియాశీలం చేయడంతో పాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి కీలక బాధ్యతలను ఈ ఇన్‌ఛార్జ్‌లు నిర్వర్తించనున్నారు. విజయనగరానికి ఎంపీ చింతకాయల విజయ్, తూర్పుగోదావరికి దేవినేని ఉమా మహేశ్వర రావు, పల్నాడుకు కొనకళ్ల నారాయణ, పశ్చిమగోదావరికి ఎంపీ భాష్యం రామకృష్ణ వంటి పలు వురు సీనియర్లకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది.

మరోవైపు,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.తన సొంత నియోజకవర్గమైన కుప్పం నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని,నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఫలితాల్లో ఏమాత్రం తేడా వచ్చినా సహించేది లేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. త్వరలోనే తాను కుప్పంలో పర్యటిస్తానని కూడా చంద్రబాబు వెల్లడించారు.

"జిల్లాలవారీ ఇన్‌ఛార్జ్‌లు":-
పార్వతీపురం మన్యం..దాడి రత్నాకర్
అల్లూరి సీతారామరాజు...పేరాబత్తుల రాజశేఖర్
శ్రీకాకుళం... ఎండీ నజీర్, విజయనగరం.. ఎంపీ చింతకాయల విజయ్,. విశాఖపట్నం.. ఎంఏ షరీఫ్ అనకాపల్లి... కొండపల్లి అప్పల నాయుడు పోలవరం...కె సత్తిబాబు, కాకినాడ...సుజయ్ కృష్ణరంగా రావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ ఎంపీ సానా సతీష్, తూర్పుగోదావరి.. దేవినేని ఉమామహేశ్వరరావు,

పశ్చిమగోదావరి..ఎంపీ భాష్యం రామకృష్ణ, ఏలూరు.. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ,కృష్ణా.. కొమ్మాలపాటి శ్రీధర్,ఎన్టీఆర్.. మక్కెన మల్లికార్జునరావు, గుంటూరు, ఎంపీ సత్యనారాయణరాజు, పల్నాడు.. కొనకళ్ల నారాయణ బాపట్ల.. జంగా కృష్ణమూర్తి.. ప్రకాశం.. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మార్కాపురం.. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, నెల్లూరు.. ఎస్వీఎస్ఎన్ వర్మ తిరుపతి.. నూకసాని బాలాజీ, చిత్తూరు.. దామచర్ల సత్య,కడప..దీపక్ రెడ్డి, అన్నమయ్య.. ఎమ్మెల్సీ శ్రీకాంత్, అనంతపురం..ఏరాసు ప్రతాప్‌రెడ్డి శ్రీసత్యసాయి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, నంద్యాల..వైకుంఠం ప్రభాకర్ చౌదరి లను నియమిచ్చారు.

# రూ. 8 కోట్ల విలువైన పంచాయతీ భూమి కబ్జా

**- ఎంపీడీవోకు మాజీ ఎన్ డి సి సి బి చైర్మన్ ఫిర్యాదు**
**- మిట్ట హరిజనవాడలోని 3.5 ఎకరాల పబ్లిక్ సర్వీస్ భూమి ఆక్రమణ**
**- ఆక్రమణదారుల నుంచి భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి డిమాండ్**



**పెళ్ళకూరు- సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన పెళ్ళకూరులోని మిట్ట హరిజనవాడ ఎగువ ప్రాంతంలో ఉన్న రూ. 8 కోట్ల విలువైన పంచాయతీ భూమి కబ్జాకు గురైందని మాజీ ఎన్‌డిసిసిబి చైర్మన్, చిల్లకూరు గ్రామ కాపురస్తుడైన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆంశోపించారు. ఈ మేరకు పెళ్ళకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ)కి ఆయన ఒక లిఖిత పూర్వక వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం... సుమారు పదేళ్ల క్రితం పెళ్ళకూరు పంచాయతీకి చెందిన 35 ఎకరాల స్థలంలో ఒక లేఅవుట్ (వెంచర్) ఏర్పాటు చేశారు. ఆ సమయంలో నిబంధనల ప్రకారం పబ్లిక్ సర్వీస్ (ప్రజా అవసరాల) కోసం 10 శాతం భూమిని, అంటే 3.5 ఎకరాల స్థలాన్ని గ్రామానికి కేటాయించారు.అయితే, ఈ విలువైన గ్రామ పంచాయతీ భూమిని పెళ్ళకూరుకు చెందిన పేరం రమేష్ నాయుడు, మరికొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేశారని సత్యనారాయణరెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ స్థలం మార్కెట్ విలువ సుమారు రూ. 8 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ అంశంపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని, కబ్జాకు గురైన 3.5 ఎకరాల భూమిని ఆక్రమణదారుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకుని గ్రామ ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీడీవో ను కోరారు.




## ఓటీటీలోకి పరిణీతి చోప్రా..

### ఉత్కంఠ రేపుతున్న తొలి వె:ఓబ్ సిరీస్

బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా తన కెరీర్‌లో కొత్త అడుగు వేస్తున్నారు. వెండితెరపై తన నటనతో ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు డిజిటల్ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. పరిణీతి ప్రధాన పాత్రలో నటించిన తొలి వెబ్ సిరీస్ "షక్: ట్రస్ట్ నో వన్" త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ మిస్టరీ థ్రిల్లర్ సిరీస్ సెప్టెంబర్ 24 నుంచి స్ట్రీమింగ్ కానుంది.ఈ సిరీస్ కథాంశం ఎంతో ఆసక్తికరంగా ఉండనుంది. తొమ్మిదేళ్లుగా ఆచూకీ లేని తన బిడ్డ కోసం ఒక తల్లి చేసే అలుపెరగని అన్వేషణే దీని ప్రధాన ఇతివృత్తం. నమ్మకం–అనుమానం, ప్రేమ–వ్యామోహం, అంతర్ దృష్టి–నిజం మధ్య ఉండే సన్నని గీతను స్పృశిస్తూ ఈ కథ ముందుకు సాగుతుంది. భావోద్వేగాలతో కూడిన డ్రామాతో పాటు చివరి వరకు ఉత్కంఠ రేపే థ్రిల్లర్ అంశాలు ఇందులో మిళితమై ఉంటాయని తెలుస్తోంది.ఈ సిరీస్‌ను రెన్సిల్ డిసిల్వా, సిద్ధార్థ్ పి. మల్హోత్రా రూపొందించగా, రెన్సిల్ డిసిల్వానే దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆల్కెమీ ఫిల్మ్స్ పతాకంపై దీనిని నిర్మించారు. పరిణీతితో పాటు సోనీ రజ్దాన్, అనుప్ సోనీ, జెన్నిఫర్ వింగెట్, తాహిర్ రాజ్ భాసిన్, హర్లీన్ సేథి, ధ్రువ్ చౌదరి, సుమీత్ వ్యాస్ వంటి భారీ తారాగణం ఈ సిరీస్‌లో కీలక పాత్రలు పోషిస్తోంది.ఈ సిరీస్ ఎంతో వేగవంతమైన కథనంతో, ఊహించని మలుపులతో ప్రేక్షకులను కట్టిపడేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. కథలో వెల్లడయ్యే ప్రతి నిజం, మరిన్ని కొత్త ప్రశ్నలను రేకెత్తించి, ప్రేక్షకులలో ఆసక్తిని నిరంతరం పెంచుతుందని నెట్‌ఫ్లిక్స్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. పరిణీతి కెరీర్‌లో ఇది ఒక ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని అంచనాలు వెలువడుతున్నాయి.

### తెలుగు హీరోల బిరుదులు.. అభిమానుల మనోభావాలు..

## ఫోర్బ్స్ కథనంతో వేడెక్కిన సోషల్ మీడియా!



ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ఇటీవల ప్రచురించిన ఒక కథనం తెలుగు సినీ అభిమానుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. 'షోస్టాపర్స్ 2026' ఫీచర్‌లో కథానాయకుడు అల్లు అర్జున్‌ను 'రెబల్ స్టార్' అని సంబో ధించడమే ఈ వివాదానికి మూలకారణం. అల్లు అర్జున్‌కు 'స్టైలిష్ స్టార్', 'ఐకాన్ స్టార్' వంటి బిరుదులు ఉండగా.. ఫోర్బ్స్ పొరపాటున ఈ విధంగా పేర్కొంది. వాస్తవానికి 'రెబల్ స్టార్' అనే బిరుదు ప్రభాస్‌కు చెందినది. ఆయన పెదనాన్న, దివంగత నటుడు కృష్ణంరాజు వారసత్వంగా ఈ బిరుదు ప్రభాస్‌కు వచ్చింది. దీంతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అభిమాన హీరో బిరుదును మరొకరికి ఆపాదించడంపై అభ్యం తరం తెలిపారు. అభిమానుల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తడంతో ఫోర్బ్స్ ఇండియా తమ డిజిటల్ కథనాన్ని అప్‌డేట్ చేసి, 'రెబల్ స్టార్' స్థానంలో 'ఐకాన్ స్టార్' అని మార్చినట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై ఫోర్బ్స్ ఇండియా గానీ, అల్లు అర్జున్ బృందం గానీ అధికారికంగా స్పందించలేదు.ఈ ఘటనపై దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ స్పందిస్తూ.. తెలుగు ప్రేక్షకులు తమ అభిమాన హీరోలకు, వారి బిరుదులకు ఎంతలా కనెక్ట్ అయి ఉంటారో ఈ సంఘటన తెలియజే స్తోందన్నారు. "తెలుగు సినిమా అభిమానులు తమ హీరోల బిరుదులను ఎంతగానో ఇష్టపడతారు. వారిని ఆరాధిస్తారు. వేలాదిగా ఉన్న అభిమాన సంఘాల ద్వారా హీరోలను దేవుళ్లుగా భావిస్తారు. ఈ బిరుదులు వారికి ఒక గర్వాన్ని, గుర్తింపును ఇస్తాయి. అందుకే తమ హీరో పేరుతో ముడిపడిన బిరుదుల విషయంలో చాలా సున్నితంగా ఉంటారు" అని ఆయన విశ్లేషించారు.తెలుగు సినీ పరిశ్రమలో ఈ బిరుదుల సంస్కృతి ఎప్పటినుంచో బలంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి, గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ, కింగ్ నాగార్జున, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ వంటి ఎందరో స్టార్లకు ప్రత్యేకమైన బిరుదులు ఉన్నాయి. పెద్ద సినీ కుటుంబాల నుంచి రాని రవితేజ (మాస్ మహారాజా), రామ్ పోతినేని (ఎనర్జిటిక్ స్టార్) వంటి హీరోలకు కూడా అభిమానులు ఇష్టంగా పిలుచుకునే బిరుదులున్నాయి ."సోషల్ మీడియా యుగంలో ఈ అభిమానం, వాదనలు మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒక హీరోతో బలంగా ముడిపడి ఉన్న బిరుదును మరొకరికి వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని చంద్ర సిద్ధార్థ్ సూచించారు. బాలీవుడ్, మలయాళంలో ఈ తరహా బిరుదుల ట్రెండ్ తక్కువగా ఉన్నా, తమిళ పరిశ్రమలో కొందరు స్టార్లకు ఉందని ఆయన గుర్తుచేశారు . మితం కాదని, హీరోయిన్లలోనూ పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. "గతంలో 'లేడీ అమితాబ్'గా విజయశాంతి గుర్తింపు పొందారు. ఇప్పుడు రష్మిక 'నేషనల్ క్రష్'గా, నయనతార, సమంత 'లేడీ సూపర్‌స్టార్లు'గా పిలవబడుతున్నారు. భవిష్యత్తులో మరింత మంది నటీమణులు ఇలాంటి ప్రత్యేక బిరుదులు పొందే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద ఫోర్బ్స్ చేసిన చిన్న పొరపాటు తెలుగు సినిమా రంగంలో బిరుదులకు, అభిమానుల భావోద్వేగాలకు ఉన్న విడదీయరాని బంధాన్ని మరోసారి స్పష్టం చేసింది.



### దులీప్ ట్రోఫీ ఫైనల్: ఇషాన్ కిషన్ విశ్వరూపం..

## ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు



చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) రికార్డు డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. అతనికి కుమార్ కుశాగ్ర (101) శతకంతో జత కలవడంతో, ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో సౌత్ జోన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ విజయం దిశగా పటిష్ఠమైన పునాది వేసుకుంది.ఓవర్‌నైట్ స్కోరు 385/4తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్, ఆరంభం నుంచే పరుగుల వరద పారించింది. వికెట్ల కోసం తీవ్రంగా ప్రయత్నించిన సౌత్ జోన్, కొత్త బంతిని తీసుకున్నా ఫలితం లేకపోయింది. పేసర్లు మహ్మద్ సిరాజ్, ఎండీ నిధీశ్ బౌలింగ్‌ను ఇషాన్ కిషన్ సమర్థంగా ఎదుర్కొని బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మరో ఎండ్‌లో కుశాగ్ర కూడా దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.లంచ్‌కు ముందు కుమార్ కుశాగ్ర తన ఆరో ఫస్ట్‌క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత త్రిపురాణ విజయ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి ఫైన్ లెగ్ వద్ద ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కుశాగ్ర ఔటైనా ఇషాన్ కిషన్ తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. అలసిపోయిన సౌత్ జోన్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని, సులువుగా బౌండరీలు బాదుతూ 270 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.డబుల్ సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడిన ఇషాన్ కిషన్, ట్రిపుల్ సెంచరీ వైపు దూసుకెళ్లాడు. ఈ క్రమంలో కాస్త అలసటకు గురై తాత్కాలికంగా రిటైర్ అయినా, మహ్మద్ షమీ (28) ఔటైన తర్వాత తిరిగి క్రీజులోకి వచ్చాడు. అయితే, మరోవైపు వికెట్లు పడుతుండటంతో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగ్ ఆన్ బౌండరీ వద్ద క్యాచ్ ఔటయ్యాడు. కేవలం 30 పరుగుల తేడాతో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. తన 334 బంతుల ఇన్నింగ్స్‌లో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే ఇది 8వ అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం విశేషం.చివరకు ఈస్ట్ జోన్ 163 ఓవర్లలో 708 పరుగులకు ఆలౌట్ అయింది. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురాణ విజయ్ 4 వికెట్లు పడగొట్టగా, చామ మిలింద్ 2 వికెట్లు తీశాడు. ఈ భారీ స్కోరుతో ఈస్ట్ జోన్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.

**సంక్షిప్త స్కోరు:** ఈస్ట్ జోన్: 163 ఓవర్లలో 708 ఆలౌట్ (ఇషాన్ కిషన్ 270, కుమార్ కుశాగ్ర 101; త్రిపురాణ విజయ్ 4/180, చామ మిలింద్ 2/88).



### పాకిస్థాన్‌లో పర్యటించేందుకు

## భారత క్రీడా జట్లకు పచ్చజెండా..!

భారత్, పాకిస్థాన్ మధ్య క్రీడా సంబంధాల పునరుద్ధరణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత క్రీడా బృందాలకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అనుమతించినట్లు వార్తలు వెలువడ్డాయి. 2027లో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న సౌత్ ఏషియన్ ఫెడరేషన్ (శాఫ్) గేమ్స్‌లో భారత క్రీడాకారులు పాల్గొంటారని పాకిస్థాన్ మీడియా కథనాలు వెల్లడించాయి.ఈ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని, దీంతో భారత బృందం పాకిస్థాన్‌కు వెళ్లనుందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలు నిజమైతే, పహల్గాం దాడి తర్వాత భారత క్రీడాకారులు పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టడం ఇదే తొలిసారి అవుతుంది. గతంలో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాల కారణంగా ఇరు దేశాల మధ్య క్రీడా కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయిన విషయం తెలిసిందే.భారత క్రికెట్ జట్టు చివరిసారిగా 2008లో పాకిస్థాన్‌లో పర్యటించగా, హాకీ జట్టు 2006లో ఆ దేశానికి వెళ్లింది. కాగా, 2027 శాఫ్ గేమ్స్‌లో క్రికెట్, హాకీతో పాటు మొత్తం 28 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత జట్ల పర్యటన వార్త క్రీడా వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, దీనిపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ఎస్టీ కాలనీవాసులకు భూములు దక్కేంతవరకు

# పోరాటం కొనసాగిస్తాం

**- అసైన్డ్ భూముల రక్షణ కోసం ఉధృతపోరాటాలు**

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుజి,శివకుమార్ వి.అన్వేష్ హెచ్చరిక**





**బ్రహ్మంగారి మఠం - సూర్య వాస్తవం:** మండలంలోని లింగాలదిన్నె పల్లె ఎస్టి కాలనీవాసుల అసైన్డ్ భూములు వారికి దక్కేంతవరకు పోరాటం కొనసాగిస్తామని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి,శివకుమార్ వి.అన్వేష్ లు హెచ్చరించారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల తహసిల్దార్ కార్యాలయం ముందు లింగాలదిన్నెపల్లె అసైన్డ్ భూముల రక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ దర్నాను ఉద్దేశించి శివకుమార్,అన్వేష్ లు మాట్లాడుతూ లింగాలదిన్నె పల్లె ఎస్టీ,బీసీలకు 2008వ సంవత్సరంలో పలుగురాళ్లపల్లె రెవిన్యూ పొలం1938 సర్వేనెంబర్ నందు 94 మంది ఎస్టి, బిసి లకు ఎకరా చొప్పున అసైన్డ్ పట్టాలు మంజూరు చేశారని 2011వ సంవత్సరంలో సబ్ డివిజన్ చేసి,మ్యాప్ వేసి,హద్దులను ఏర్పాటుచేసి భూమి అప్పగింత పత్రాలు కూడ మంజూరు చేశారని నాటినుండి ఆభూములను ఎస్టీ బీసీలు సాగు చేసుకుంటున్నారని వారు గుర్తు చేశారు గత నాలుగు సంవత్సరాల నుండి దళితులను రెచ్చగొడుతూ వారిని అడ్డం పెట్టుకుని భూములను కాజేయాలనీ కుట్రపన్నిన కొంతమంది భూకబ్జాదారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి చేరి అసైన్డ్ మెంట్ లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతున్నారనివారు విమర్శించారు. తహసిల్దారు వారు జోక్యం చేసుకొని బాధితులకు భూ ఆక్రమణదారుల నుండి రక్షణ కల్పించి పాస్ పుస్తకాలు మంజూరు చేసి ఆన్ లైన్ చేయాలనీ 1938 సర్వేనెంబర్ నందు 4,5, మంది దాదాపు 100 ఎకరాల భూమిని ఆక్రమించుకొని ఉన్నారని వాటిని స్వాధీనం చేసుకొని జోగుపల్లి, ముదుమాల పలుగురాళ్లపల్లె, గ్రామాల్లోని దళితులకు పంచాలని వారు డిమాండ్ చేశారు. 1938 సర్వే నంబర్లో జోగుపల్లి పలుగురాళ్లపల్లి మల్లేపల్లి,పాపిరెడ్డిపల్లి గ్రామాలలోని పేదలకు దాదాపు 400 ఎకరాలకు డీకేటి పట్టాలు మంజూరు చేసి ఉన్నారని వెంటనే వీరందరికీ సర్వే చేసి భూములు పంచాలని లేనిపక్షంలో10,వ తేదీ నుండి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు అధికారులను హెచ్చరించారు అనంతరం తహసిల్దార్ వారికి ఎస్టీ కాలనీవాసులకు సంబంధించిన అసైన్డ్ భూములకు సంబంధించి డీకేటి పట్టాలు భూముల అప్పగింత పత్రాలు స్కెచ్,మ్యాపు మొదలు రికార్డులను అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ 'అసైన్డ్ భూముల రక్షణ కమిటీ సభ్యులు ఆంజనేయులు వెంకటకృష్ణ రఘు అనసూయమ్మ బాధిత ప్రజలు పాల్గొన్నారు.

## రక్తదానం ద్వారా యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించాలి



**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం:** రక్తదానం అనేది ఆపదలో ఉన్న వారికి అందించే అత్యంత విలువైన మానవతా సేవ అని వాగ్దేవి ఇన్స్టిట్యూషన్స్ ప్రిన్సిపల్ కే. రామమోహన్ రెడ్డి అన్నారు. కడప మరియు అన్నమయ్య జిల్లాల స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాల్లో నాలుగవ రోజు వాగ్దేవి ఇన్స్టిట్యూషన్స్ ఈ ఈ ఈ లెక్చరర్ డాక్టర్ గోపిరెడ్డి భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో రక్తం కొరత ఏర్పడినప్పుడు రక్తదాతలే ప్రాణదాతలుగా నిలుస్తారని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మరో అతిథిగా విచ్చేసిన ఇన్స్టిట్యూషన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రజినీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యువతలో సేవా భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని మరియు రక్తదానం ద్వారా ప్రత్యక్షంగా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం లభిస్తుందని, విద్యార్థులు ఇటువంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిర కోఆర్డినేటర్ డాక్టర్ గోపిరెడ్డి భువనేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర సమయంలో దాత చేసిన రక్తదానం ఎంతో విలువైనదిగా మారుతుందని అన్నారు. యువత రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఇన్స్టిట్యూషన్స్ లెక్చరర్ రామాంజనేయరెడ్డి కోరారు. రక్త దానం చేసిన ప్రతి ఒక్కరినీ కళాశాల చైర్మన్ జీ హుస్సేన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి కేంద్రం సిబ్బంది, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థి రక్తదాతలు పాల్గొని కార్యక్రమం దిగ్విజయం చేశారు.

## ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల మంజూరు పై బిగ్ అప్డేట్



**కడప - సూర్య వాస్తవం:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పథకం కింద నూతన పెన్షన్ అందిస్తామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి ఎస్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వృధ్యాప్య, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వారి సంక్షేమం కోసం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మంజూరుకై అర్హులనుండి దరఖాస్తులను ఆహ్వానించిందన్నారు. అర్హుల నుండి ఎన్టీఆర్ భరోసా పింఛను దరఖాస్తులను 7 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు మాత్రమే స్వీకరిస్తారని దరఖాస్తుదారులు గమనించగలరని సూచించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హులైన అందరూ అవసరమైన అన్ని రకాల ధృవ పత్రాలను సిద్ధం చేసుకొని వెంటనే మీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు.

## ఈశ్వరి దేవి మఠం ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** మహాశక్తి స్వరూపిణి జగన్మాత ఈశ్వరిదేవి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సిజిఎఫ్ ద్వారా 3 కోట్ల రూపాయలను మంజూరు చేయించారు. అందులో భాగంగా భాగంగా సోమవారం మఠాధిపతి శ్రీ శివకుమారస్వామి దంపతులు ఆధ్వర్యంలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా శంకుస్థాపన మహోత్సవం నిర్వహించామని కార్యనిర్వహణాధికారి బి వి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి అచలానంద స్వామి ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి,తెదేపా మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి,కాంట్రాక్టర్ పూజ శివయాదవ్,సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, నొస్సం దత్తాత్రేయ స్వామి, పి పి ఎన్ ప్రసాద్, సంపత్ కుమార్, వీరపు ఉమాపతి, ముక్కామల భాస్కర్ రెడ్డి,సుంకు సురేష్ వేద పండితులు,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద అతిథులు కొబ్బరికాయ కొట్టి,నవధాన్యాలు వేసి వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయి భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## మోహిద్దీన్ ఖాన్‌కు విశ్వనాట్యరత్న అవార్డు ప్రదానం

**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం:** స్థానిక వైఎంఆర్ కాలనీలోని నటరాజ కళా క్షేత్రం నాట్యగురువు నాట్యవిశారధ పఠాన్ మోహిద్దీన్ ఖాన్ను 'విశ్వ నాట్య రత్న' అవార్డుతో సత్కరించారు. హైదరాబాదు లోని రవీంద్రభారతిలో ఏఎస్ కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురువులకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో నాట్యగురువు మోహిద్దీన్ ఖాన్ కు విశ్వనాట్యరత్న అవార్డును ప్రముఖులు చేతుల మీదుగా అందించి శాలువ కప్పి మెమెంటోతో సత్కరించారు. అలాగే పి.సోహైల్బాన్కు, పి.మిత్రవిందకు విశ్వనాట్యరత్న అవార్డులు, మదీహ, గీర్వాణి, హన్విత, శాన్విత్, కీర్తన ప్రియ, రుత్విక, సిసిర, ఆశ్రిత, మేఘన, ప్రజ్ఞ. మునిశ్రావ్యలకు భారతీయ నృత్య రత్న అవార్డులు అందించారు. అవార్డులు సాధించిన వారిని పుర ప్రముఖులు, కళాకారులు, కళాభిమానులు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.




## పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకోండి

**- కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్- అర్హత కలిగిన ఒక్క లబ్దిదారుడు నష్టపోకూడదని సచివాలయం సిబ్బందికి కమీషనర్ ఆదేశం**



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ పథకానికి అర్హులైన లబ్దిదారులు దరఖాస్తులు చేసుకోవాలని కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. నిరుపేదలకు సామజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా ఆన్ లైన్ పోర్టల్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందనిఈ నెల సెప్టెంబర్7నుండి 16 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కమీషనర్ అన్నారు. అర్హులైన 60 సంవత్సరాలు దాటినా వృద్దులతో పాటు చేనేత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చర్మకారులు, దివ్యాంగులు, గీత కార్మికులు, మత్సకారులు, ట్రాన్సజెండర్స్ సంబంధిత దస్త్రాలతో వార్డు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కమీషనర్ కోరారు. సందర్భంగా కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ టెలికాన్ఫెరెన్స్ ద్వారా సచివాలయం సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ అర్హత ఉన్న ఒక్క లబ్దిదారుడు నష్టపోకూడదని అన్నారు.

## రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే 2029 ఎన్నికల గెలుపును నిర్ణయించబోతున్నాయి

**- రాచమల్లు శివప్రసాద్ రెడ్డి**




**కడప- సూర్య వాస్తవం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపోటముల ప్రభావం 2029 అసెంబ్లీ ఎన్నికల్లో వుంటుందని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం కడప పట్టణంలోని కడప కన్వెన్షన్ హాల్ నందు వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన, కడప జిల్లా ఎంపీ వై.యస్ అవినాష్ రెడ్డి ముఖ్య అతిధిగా వై.యస్.ఆర్.సి.పి జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వై.యస్.ఆర్.సి.పి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కమిటీ కార్డు కలిగిన వై.యస్.ఆర్.సి.పి వ్యక్తి కె ఈ సారి రాబోయే ఎన్నికల్లో ప్రొద్దుటూరు నుంచి పార్టీ టికెట్ ఇచ్చి పార్టీ అభ్యర్థిగా ఖరారు చేస్తామని అన్నారు. అట్టి అభ్యర్థి తెలుగుదేశం పార్టీ వైఫల్యాలను స్థానికంగా ప్రజలకు చెప్పగలిగితే, ఖచ్చితంగా గెలవగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గెలిచిన తరువాత పార్టీ మారే వాడికి టికెట్ ఇవ్వమని వై.యస్.ఆర్. సి.పి అభ్యర్థులు ఖచ్చితంగా గెలిచేలాగా ప్రతీ కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు. జగన్ మోహన్ రెడ్డి కష్టపడుతున్నారు, వై.యస్.ఆర్. సి.పి స్థానిక నాయకత్వం కుడా జగన్ మోహన్ రెడ్డి లాగా మొక్కవోని ధైర్యంతో పని చేయాలని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వై.యస్.ఆర్.సి.పి కార్యకర్తలకు తాము కొండంత అండగా ఉంటామని హామీ ఇచ్చారు. , రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వంతో, పోలీసులతో రాచమల్లు అనే నేను ఒక రాజకీయ యుద్ధం చేసి గెలుపు దిశగా పని చేస్తామని జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి కి మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయిలో వివిధ హోదాల్లో కొనసాగుతున్న పలువురు వై.యస్.ఆర్.సి.పి నాయకులు మరియు మహిళా నేతలు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల విజయం



**దువ్వూరు - సూర్య వాస్తవం:** యాజమాన్య మొండివైఖరి కి వ్యతిరేకంగా, తమ హక్కుల సాధన కోసం కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిర్వహించిన చలో తిరుపతి, చలో విజయవాడ కార్యక్రమాలు విజయవంతం కావడంతో యాజమాన్యం ఒక్క అడుగు దిగివచ్చిందని విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాయబ్ రసూల్ తెలిపారు. సోమవారం స్థానిక సివివి కళ్యాణ మండపం నందు కడప జిల్లా స్ట్రగుల్ కమిటీ జిల్లా అధ్యక్షులు బి ఎన్ నాగసుబ్బయ్య, డిస్కం ఉపాధ్యక్షులు శీలం సుబ్బరాయుడులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల మహా పోరాటానికి ఈరోజు విజయం లభించిందన్నారు. మూడు డీఏ ల విడుదలపై స్ట్రగుల్ కమిటీ తరపున హర్షం ధన్యవాదాలు తెలిపారు.విద్యుత్ సంస్థల్లోని సమస్యల పరిష్కారం కోసం స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా విద్యుత్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మహాపోరాటం విజయవంతమైందన్నారు. కార్మికుల తీవ్ర ఒత్తిడి, అలుపెరగని పోరాటం కారణంగా చాలా కాలంగా బకాయి ఉన్న మూడు డీఏ లను యాజమాన్యం ఈరోజు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గత 22 రోజుల నుంచి బిల్ కలెక్టర్లు తిరుపతి సిఎండి ఆఫీస్ నందు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ పూర్తిగా మద్దతు తెలియజేస్తుందన్నారు. వారి సమస్యలు పరిష్కారం కాని పక్షంలో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. మూడు డీఏల విడుదల ద్వారా ఒక అడుగు ముందుకు పడినప్పటికీ, కార్మికుల మరికొన్ని ప్రధాన సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ యాజమాన్యం ముందు తమ డిమాండ్లను ఉంచిదన్నారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140

## కళాసమితి ఉచిత శిక్షణాలయ

# భవననిర్మాణంకు భూమిపూజ

**పామిడి– సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన పామిడి పట్టణములోని ఎద్దులపల్లి రోడ్డులో గల స్వరరాగ నాటక కళాసమితి ఉచితశిక్షణాలయ భవననిర్మాణం కొరకు ఉదయం ఆరు గంటలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాబంధువు, కళా పోషకులు అయిన జిల్లా రెవెన్యూశాఖఅధికారి మలోల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత సాంస్కృతి సాంప్రదాయం లో భాగంగా పౌరాణిక రంగస్థల కళలను సాధన చేయడం ఒక భాగ్యమని, ఇది యోగ,ఆసనం,వ్యాయామం కన్నా ఎక్కువ ఫలితాలు పొందవచ్చునని, మెదడు చురుకుతనం, రక్త ప్రసరణ జ్ఞాపకశక్తి మెరుగుదల, రక్తపోటు, తదితర చిన్నపాటి రోగాలు దరిదాపులకు రావని, రాగాలు పాడితే రోగాలు పోతాయని, రంగస్థలం కళలు ఒక యోగం అన్నారు.ప్రతి ఒక్కరు గంటసేపు వ్యవధి చూసుకొని సాధన చేయడం అలవర్చుకోవాలన్నారు. కళాసమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షులు, రిటైర్డ్ పశువైద్యాధికారి యం.దేవరాజు మాట్లాడుతూ 2008 సంవత్సరముల నుంచి ఔత్సాహిక పౌరాణిక నాటక రంగస్థల కళా కారులనుండి ఒక్క రూపాయి తీసుకోకుండా రూముకు



బడుగులు, కరెంటు బిల్లులు కట్టుకుంటూ స్వంత ఖర్చులతో ఉచితముగా శిక్షణాతరగతులు నిర్వహి స్తున్నామన్నారు. పామిడి మండలం తోపాటు చుట్టు ప్రక్కల మండలాల నుంచి వచ్చే ఔత్సాహిక కళాకారులు దాదాపు 60 మందికి మాశిక్షణాలయంలో ఉచితముగా నేర్పుతున్నానన్నారు. కలలపై మక్కువ కలిగిన వారు రావలసిందిగా కోరారు. మా సంస్థ నుంచి ప్రభుత్వ ప్రైవేటు నాటకాలు దాదాపు 210 ప్రదర్శనలు ఇచ్చామని, అందుకు ఎన్నో అవార్డులు సన్మానాలు ప్రశంసాపత్రాలు బిరుదులు పొందామన్నారు. వీటన్నిటిని ప్రభుత్వం గుర్తించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉచిత శిక్షణాలయం భవన నిర్మాణముకు పామిడిలోని 20వ వార్డులో ప్రభుత్వ పెన్షనర్స్ భవనం ప్రక్కన రెండు సెంట్లు కేటాయించాలని ఆ స్థలంలో భవన నిర్మాణం కోసం సోమవారం ఉదయం 5:30 గంటలకు పురోహితుడుగుత్తి తోటపల్లి సుబ్రహ్మణ్యంశర్మ చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆహ్వానించిన వెంటనే కాదనకుండా ముఖ్య అతిథిగా వేకువ జామునే వచ్చిపాల్గొన్న డిఆర్ఓ మలోలాకు ఆయనతో పాటు కళాకారులందరూ ధన్యవాదములు తెలిపారు. కళా సమితి పురోగతి, అభివృద్ధి చెందడానికి సీనియర్ కళాకారులు రంగస్థలం స్టేట్ ప్రైజ్ విన్నర్, సీనియర్ పాత్రికేయుడు పుంజా కృష్ణారావు సహాయ, సహకారము మరువలేమన్నారు. కావున పౌరాణిక రంగస్థలం నాటక ఉచిత శిక్షణాలయం భవన నిర్మాణమునకు సేవా దృకృథంతో దాతలు ముందుకు రావలసినదిగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలోల, రైల్వే లెక్చరర్ సుధాకర్, ఎం.దేవరాజు, పుంజా కృష్ణారావు, నారాయణరెడ్డి,చీమల పెద్ద తిరుపాలు, హనుమంతరెడ్డి, చిన్నఆంజనేయులు, రామలింగయ్య, బ్రహ్మయ్య, హుస్సేన్, నాగార్జున,అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...!

**- పార్టీ బలోపేతం, ప్రజా పాలనపై నేతలకు దిశానిర్దేశం**



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా పాలనను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, రాబోయే పార్టీ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పార్టీ నేతలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పొలిట్‌బ్యూరో సభ్యులు, జోనల్ ఇంఛార్జ్‌లు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ దరఖాస్తులతో కిటకిటలాడిన బెళుగుప్ప సచివాలయం



**బెళుగుప్ప– సూర్య వాస్తవం:** పింఛన్ల కోసం అర్హత ఉన్న లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో బెళుగుప్ప సచివాలయంలో సోమవారం సందడి నెలకొంది. ప్రభుత్వ పింఛన్ పొందేందుకు అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో సచివాలయా నికి చేరుకుని దరఖాస్తులు సమర్పించారు.ఎన్నో ఏళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్న పలువురు వృద్ధులు, వితంతువులు తమకు పింఛన్ మంజూరు అవుతుందనే ఆశతో ఉదయం నుంచే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. దీంతో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన వారితో సచివాలయ ప్రాంగణం కిటకిటలాడింది. కొందరు దరఖాస్తుదారులు అవసరమైన ధ్రువపత్రాలతో క్యూ కట్టగా, మరికొందరు దరఖాస్తు ప్రక్రియపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టడంతో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉన్నందున చివరి రోజు వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తులు సమర్పించాలని వారు కోరారు.
అర్హత ఉన్నప్పటికీ గతంలో పింఛన్ పొందలేకపోయిన వారు, అలాగే కొత్తగా అర్హత సాధించిన వారు ఈ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పింఛన్ అనేది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునందించే పథకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

## ప్రేమ వ్యవహారం.. పెళ్లి విషయమై ఒత్తిడి?

**- "నా చావుకు ఎవరూ కారణం కాదు" అంటూ వీడియో..**



**రాయదుర్గం – సూర్య వాస్తవం:** రాయదుర్గం పట్టణంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపురం లేఅవుట్‌లోని 17వ నంబర్ ఇంట్లో నివాసం ఉంటున్న మంజు అనే యువకుడు సోమవారం రాత్రి సుమారు 11:30 నిమిషాలకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు "నా చావుకు ఎవరూ కారణం కాదు" అంటూ వీడియోను రికార్డు చేసి పెట్టినట్లు పోలీసులు తెలిపారు. మంజు ఓ యువతిని ప్రేమిస్తున్నాడని, ఆమెను పెళ్లి చేసుకోవాలని కోరినట్లు సమాచారం.
అయితే పెళ్లి విషయమై యువతి కుటుంబ సభ్యులు అంగీకరించలేదని తెలుస్తోంది. మరోవైపు తనకు పెళ్లి చేయాలని మంజు తల్లిపై కూడా ఒత్తిడి తెస్తుండేవాడని, ప్రస్తుతం ఎలాంటి పని చేయకుండా ఉంటే ఎలా పెళ్లి చేయాలని ఆమె చెప్పినట్లు పోలీసులు తెలిపారు.ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మంజు ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోండి..!

**- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**
**- మండపాల నిర్వాహకులు పోలీసు అనుమతులు తప్పనిసరిగా పొందాలి**
**- శింగనమల సీఐ రాగిరి రామయ్య, ఎస్ఐ ప్రసాద్**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించుకోవాలని శింగనమల సీఐ రాగిరి రామయ్య, ఎస్ఐ ప్రసాద్ సూచించారు.
సోమవారం శింగనమల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులు, కమిటీ సభ్యులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. గణేష్ మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అవసరమైన ఇతర శాఖల అనుమతులు కూడా పొందాలని స్పష్టం చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వ, పోలీసు నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత కమిటీ సభ్యులనే బాధ్యులను చేస్తామని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.మండల ప్రజలు, గణేష్ ఉత్సవాల నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించి వినాయక చవితి వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా నిర్వహించుకోవాలని సీఐ, ఎస్ఐ కోరారు.

## ఏడేళ్లుగా సమస్యలేనా..?

**- సచివాలయ ఉద్యోగుల సమస్యలపై జేఏసీ నిరసన**
**- డిమాండ్లు పరిష్కరించకపోతే చలో కలెక్టరేట్‌కు పిలుపు: జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ**





**అనంతపురం – సూర్య వాస్తవం :** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు గత ఏడు సంవత్సరాలుగా పలు సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ వాటికి పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఆరోపించారు. తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాల సేవ పూర్తి చేసిన ప్రతి ఉద్యోగికి ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ కల్పించాలని డిమాండ్ చేశారు.పదోన్నతుల సమయంలో రూ.30 వేల కంటే తక్కువ కాకుండా పే స్కేల్ కల్పించాలని, సచివాలయ ఉద్యోగి మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులకు మూడు నెలల్లోపు కారుణ్య నియామకం చేపట్టాలని కోరారు.ఉద్యోగుల ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తోందని జేఏసీ నాయకులు విమర్శించారు. జీవో నంబర్ 11ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా బీఎల్ఓ విధులను ఎన్నికల కమిషన్ సూచనల మేరకు 14 శాఖలకు చెందిన ఉద్యోగులకు కూడా కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డి.సుధాకర్, లక్ష్మీనారాయణ, చిన్నారప్ప, మల్లికార్జున, వరప్రసాద్, వీరనారప్ప, శివశంకరయ్య, వినయ్, తిప్పేస్వామి, హనుమంతు, మహేష్ నాయక్, రవికుమార్, నరపరెడ్డి, ధనుంజయ, రవితేజ, మౌలాలమ్మ, దుర్గా, దామోదర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీకాంత్, హరి, కిషోర్‌కుమార్, లక్ష్మీకాంత్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పామిడిలో ప్రొద్దుటూరు వృద్ధుడు మరణం





**పామిడి – సూర్య వాస్తవం :** ప్రొద్దుటూరు నివాసి చింతాకుల ఓబులేష్ కుమారుడు చింతాకుల అశోక్ (65) ఈయనది స్వగ్రామం ఈరన్నపల్లి 25 సంవత్సరాల క్రితం ప్రొద్దుటూరులో పోయి స్థిరపడినాడు ఇతనికి ఆరోగ్యం బాగాలేక పోవడంతో పెళ్ళాం పిల్లలు సరిగా పట్టించుకోకపోవడంతో శ్రీరామనవమి రోజున దాదాపు 6 నెలల కిందట ఇంటి నుంచి అలిగి వచ్చినాడు. రెండు రోజుల క్రితం పామిడి ప్రభుత్వ ఆసుపత్రి నందు తిరుగుతూ అక్కడే పడుకునేవారు. ఆదివారం రాత్రి ఆసుపత్రి ఆవరణంలో ఉన్న రేకుల షెడ్డు కింద పడుకొని సహజమరణం పొందాడు.ప్రస్తుతం సమాచారం అతని కొడుకు అయిన హరికృష్ణ ప్రొద్దుటూరులోని హరికృష్ణకు తెలియపరచామని పోలీసులు తెలిపారు.

## కనేకల్లు కాపు (బలిజ) జేఏసీ అధ్యక్షులుగా రాపా ప్రకాష్ నియామకం



**కనేకల్లు – సూర్య వాస్తవం:** కనేకల్లు మండల కాపు బలిజ జేఏసీ అధ్యక్షులుగా రాపా ప్రకాష్ నియమితుల య్యారు. ఈ విషయాన్ని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కనేకల్లు మండల కాపు బలిజ జేఏసీ అధ్యక్షులు రాపా ప్రకాష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ అమ్మ శ్రీనివాసులు నాయుడు ఆదేశాల మేరకు తనను కనేకల్లు మండల కాపు బలిజ జేఏసీ అధ్యక్షులుగా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే కాపునాడు రాయలసీమ జోన్ అధ్యక్షులు పాండు రంగ, అనంతపురం జిల్లా అధ్యక్షులు రాపా ధనంజయ్య, సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఈటికింటి మహేష్, కనేకల్లు బలిజ సంఘం అధ్యక్షులు ముక్తము మురళిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కాపు బలిజ సంఘ పెద్దలందరినీ కలుపుకొని, వారి సూచనలు, ఆదేశాలను గౌరవిస్తూ ముందుకు సాగుతానని రాపా ప్రకాష్ తెలిపారు. తనపై నమ్మకంతో కనేకల్లు మండల జేఏసీ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, తన శక్తి మేరకు బలిజల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం నిరసన



**పామిడి – సూర్య వాస్తవం:** పామిడి వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని రెగ్యులరైజేషన్ జరిగేంతవరకు వారికి 100 శాతం గ్రాస్ (గ్రాస్) వేతనం కల్పించాలని, అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు అందుతున్న మాదిరిగానే ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సామాజిక ఆరోగ్య కేంద్రం సిహెచ్సి లో వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ, తమకు ఉద్యోగ భద్రత, సమాన వేతనం, ఇతర సంక్షేమ సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, అప్పటివరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు గ్రాస్ మరియు ఇతర సదుపాయాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో అనంతపురము జిల్లా మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకృష్ణ తేజస్విని సత్యాంజనేయులు, కవితమ్మ తదితర కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

## నారా లోకేష్‌కు ఘన స్వాగతం

**- పనబాక భూలక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణుల ఆత్మీయ స్వాగతం**
**- నారా లోకేష్‌ను కలిసిన పనబాక భూలక్ష్మి పలు నియోజకవర్గ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నేత మృతి చెందిన టీడీపీ నేతల**
**- కుటుంబాలకు పరామర్శ రేణిగుంటకు చేరుకున్న మంత్రి నారాలోకేష్**



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మృతి చెందిన టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు విద్య, ఐటీ శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తిరుపతి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.చంద్రగిరి నియోజకవర్గ అబ్జర్వర్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ,విజయవాడ కనకదుర్గమ్మ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు,నెల్లూరు పార్లమెంట్ టీడీపీ మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి విమానాశ్రయంలో నారా లోకేష్‌ను కలిసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంతో పాటు పార్టీకి సంబంధించిన పలు అంశాలు,స్థానిక సమస్యలను పనబాక భూలక్ష్మి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. అనంతరం నారా లోకేష్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, చంద్రగిరి నియోజకవర్గం,పాకాల మండలానికి చెందిన, మృతి చెందిన టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నారా లోకేష్‌కు స్వాగతం పలికారు.

## ప్రజా సమస్యలపై ఎంపీడీవోకు ఫిర్యాదు

**- సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డి కిరణ్ కుమార్**
**- స్పందించిన మండల అధికారులు**



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** తడ మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డి.కిరణ్ కుమార్ తడ మండల ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి ఫిర్యాదు చేశారు.తడ మండలంలోని గ్రామాల్లో త్రాగునీటి కొరత,పారిశుద్ధ్య లోపం,వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీడీవో దృష్టికితీసుకెళ్లారు.ముఖ్యంగా అనపగుంట గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని,పారిశుద్ధ్య పనులు సరిగా జరగకపోవడంతో దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు.వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.
అలాగే ఇరకం గ్రామ పంచాయతీలో నీరు వదిలే సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని,దీంతో వారు విధులకు సరిగా హాజరు కావడం లేదని,దీని ప్రభావం గ్రామంలో నీటి సరఫరాపై పడుతోందని వివరించారు.
ఈ ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో వెంటనే తన ఫోన్ ద్వారా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఫోన్ చేసి,పెండింగ్ లో ఉన్న సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించాలని, జీతాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంభాకం హరికృష్ణ,జిల్లా కిసాన్ విభాగం అధ్యక్షులు జోగి వినోద్,సూళ్లూరుపేట మండల కార్యదర్శి బొగ్గల సురేష్,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ హోటల్ అధినేత రమేష్ రెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంతాపం



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని ప్రముఖ గణేష్ హోటల్ అధినేత రమేష్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య సోమవారం గణేష్ హోటల్ వద్దకు వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం రమేష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కిలివేటి సంజీవయ్య,వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.రమేష్ రెడ్డి మృతి కుటుంబ సభ్యులతో పాటు నాయుడుపేట ప్రజలకు కూడా తీరని లోటని పేర్కొన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్బురామయ్య నాయుడుపేట టౌన్ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి రాష్ట్ర కళాకారుల కార్యదర్శి కటకం జయరామయ్య మాజీ కౌన్సిలర్లు గంధవల సిద్ధయ్య కావేరిపాకం అశోక్ రహమతుల్లా తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొని రమేష్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

## ఇన్ టచ్ పరిశ్రమలో కార్మికులను తొలగించడం అన్యాయం

**- ఇన్ టచ్ పరిశ్రమ ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా**



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** ఓజిలి మండలం అత్తివరం గ్రామంలో ఇంట్రచ్ కంపెనీ లో 29 మంది కార్మికులను పనిలో నుంచి తొలగించడం అన్యాయమని సిఐటి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం సిఐటియు నాయకులు కార్మికులతో కలిసి ఇన్ టచ్ పరిశ్రమ ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కేరడార్ అధ్యక్షులు ఎస్.కె అబ్దుల్లా మాట్లాడుతూ పరిశ్రమను స్థాపించే ముందు ప్రజలు అంగీకారం లేకుండానే ఇష్టానుసారంగా పరిశ్రమను పెట్టి ఆదాయాలు సంపాదించుకుంటూ స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుండి వలస కార్మికులతో పనిచేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానికులకు చీపర్ పోస్టులు 30 మందిని ఏర్పాటు చేసుకుని వారికి కనీస వేతనం పిఎఫ్ వి ఎస్ ఐ ఇంక్రిమెంట్లు జీతంతో కూడిన సెలవులు ఇవ్వకపోగా ట్రావెల్ చార్జీలు ఇవ్వడం లేదన్నారు.క్యాంటీన్ ఉన్న కార్మికులకు అనుమతి లేదు అని తెలిపారు.పరిశ్రమల్లో కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు డ్యూటీ డాక్టర్లు అంబులెన్స్ లేవని తెలిపారు.

ఈ సందర్భంగా స్థానిక కార్మికులు ప్రసన్న నాగమ్మ మాట్లాడుతూ ఈ పరిశ్రమ పెట్టి కలుషిత నీటిని చెరువులోకి విడుదల చేయడం వలన పంట నష్టం జరగడమే కాక మూగజీవాలు ప్రమాద బారిన పడుతున్నాయని తెలిపారు.దుమ్ము పొల్యూషన్ తో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బాగున్న రోడ్లను భారీ వాహనాలతో ధ్వంసం చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదన్నారు తొలగించిన 29 మంది స్థానిక కార్మికులకు అవకాశం కల్పించి చట్టపరమైన సౌకర్యాలు కల్పించని పక్షంలో గ్రామస్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనురాధ, గీత,కల్పన, మంజులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలకు జీవిత ఖైదీలు రూ.25వేల జరిమానా



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణ పరిధిలోని 2021 సంవత్సరం విన్నమాల వద్ద జరిగిన హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలకు జీవిత ఖైదు పడింది.ఈ మేరకు సోమవారం గూడూరు అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించింది.పోలీసుల వివరాల ప్రకారం.2021 నవంబర్ 17న విన్నమాల వద్ద ఫిర్యాదిదారుడి కుటుంబానికి, ముద్దాయిల కుటుంబానికి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో అరవ శ్రీనివాసులు,శీనయ్యపై ముగ్గురు ముద్దాయిలు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందారు.ఈ ఘటనపై అప్పటి నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి సీఐ వై.వి.సోమయ్య దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసులో పేర్నాటి సాగర్,పేర్నాటి బెనహర్,పేర్నాటి అనిల్ నేరం రుజువు కావడంతో గూడూరు అదనపు జిల్లా న్యాయస్థానం ముగ్గురికీ జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఐపీస్ ఆదేశాలు,నాయుడుపేట డీఎస్పీ మార్గదర్శకత్వంలో పోలీసులు కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టారని పోలీసులు తెలిపారు. కోర్టు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసంత్ కుమార్ వాదనలు వినిపించగా,సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడంలో నాయుడుపేట అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు సహకరించారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె– సూర్య వాస్తవం :** నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణం ఎం .ఎస్ ఫంక్షన్ హాల్ నందు బనగానపల్లె పట్టణం ముత్తుమియ్య కాలనీ కి చెందిన షేక్ మహమ్మద్ వలి కుమారుడు వలిమా కార్యక్రమానికి హాజరు అయి నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు...!



**గుంతకల్ –సూర్య వాస్తవం** :గుంతకల్ మండలంలోని నరసాపు రం గ్రామంలో శ్రీ ఆచార్య ప్రభోధా నంద యోగగేశ్వర్లు వారి ఆధ్వర్యం లో శ్రీ కృష్ణాజన్మాష్టమి ష్టమి వేడు కలు 2026భాగంగా భగవద్గీత శ్లో కాల పోటీ వేడుకలు ఎన్ నరసాపు రం గ్రామంలో ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనం గా నిర్వహించారు. శ్రీ ఆచార్య ప్ర భోధా నంద సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ స్తులు,యువత పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు.జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ స్వామివారికి ప్రత్యేక పూ జలు నిర్వహించి,నైవేద్యం సమర్పిం చారు.అనంతరం స్వామివారి విగ్ర హాన్ని గ్రామంలోని పురవీధుల్లో భక్తి శ్రద్ధలతో ఊరేగించారు.ఈ సంద ర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని భక్తిభావంతో వేడుకల్లో పాల్గొన్నా రు.చిన్నారులు రాధాకృష్ణుల వేష ధారణలో అలరించగా,గ్రామంలో ఆధ్యాత్మికతతో కూడిన పండుగ వాతావరణం నెలకొంది. వేడుకలు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలొ ప్రభోధనంద స మితి సభ్యులు మరియు గ్రామా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు లేని నిరుపేదలకు స్థలం ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలి సిపిఐ డిమాండ్

**- ఆర్డీఓ, తహసీల్దార్‌కు సిపిఐ వినతి**



**బనగానపల్లె –సూర్య వాస్తవం:** బనగానపల్లె గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బనగానపల్లె మండలం సమితి ఆధ్వర్యంలో ఆర్డీఓ, నరేంద్ర నాథ్ రెడ్డి కి తహసీల్దార్ చంద్ర శేఖర్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది పేదలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో, పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన ప్రతి ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు అర్హులైన పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చినప్పుడు అధికారులు దరఖాస్తులను స్వీకరించాలని , వాటిని పరిశీలించాలి కాని కొన్ని గ్రామ సచివాలయాల్లో అధికారులు అర్జీలు తీసుకోవడం లేదు తీసుకున్న తిరిగి వెనక్కి ఇస్తున్నారు ఇది సైరైన పద్ధతి కాదని సిపిఐ నాయకులు ఆర్డీవో గారికి ఫిర్యాదు చేయడం జరిగింది అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పేదల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి గౌరవప్రదమైన నివాస వసతి కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఏ శివయ్య సిపిఐ సీనియర్ నాయకులు జి సంజీవులు సిపిఐ నాయకులు పలుకూరు లక్ష్మయ్య సుబ్బయ్య కొత్తూరు సుబ్బరాజు పాల్గొన్నారు.

## 17న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా కార్యక్రమాలను విజయవంతం చేద్దాం

**నంద్యాల– సూర్య వాస్తవం :** నంద్యాలలో సేవా సంకల్పం సద్భావన కార్య శాల కార్యక్రమము నంద్యాల భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నరేంద్ర మోడీ గారి ఈనెల 17వ తారీఖున పుట్టినరోజు నుండి దాదాపుగా 17 రోజులు వివిధ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మండల ఇన్చార్జులు పదాధికారులు అందరు కూడా దాదాపుగా 15 రోజులు ఈ కార్యక్రమం చేయవలెనని రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షులు శ్రీ సునీల్ రెడ్డి వారి ప్రసంగములో కార్యకర్తల నాయకుల సమావేశంలో వారు తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు జిల్లా ఇన్చార్జ్ పార్థసారథిగారు కోయించార్జ్ కాశీ విశ్వనాథ్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుడ్డ శ్రీకాంత్ రెడ్డి కసెట్టి కృష్ణమూర్తి సీనియర్ నాయకులు డోన్ రమణ లోకేశ్వర్ రెడ్డి . మేడ మురళి చంద్రశేఖర్ నిమ్మకాయల సుధాకర్ ప్రశక్తి చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి శివన్న యాదవ్ కిషన్ మోక్ష జిల్లా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి సీనియర్ నాయకులు లింగన్న సీనియర్ నాయకులు బిజెపి బీవీ సుబ్బారెడ్డి సీనియర్ మహిళా కార్యకర్తలు అందరూ ఈ సమావేశంలో పాల్గొనడం జరిగింది.

